

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ

: fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

17-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 76 పేజీలు: 8+16 వెల: 6.50


సంస్కరణలతో రైల్వేలో కొత్త ప్రమాణాలు: ప్రధాని

పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి.. 5

## బిల్లుల్లో ఏం ఉందంటే..

**డీలిమిటేషన్ బిల్లు:**

లోక్‌సభలో సభ్యుల సంఖ్య 543 నుంచి 845కి పెంపు

815 సీట్లు రాష్ట్రాలకు, 35 సీట్లు కేంద్రపాలిత ప్రాంతాలకు

**నారీశక్తి వందన బిల్లు:**

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు

లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళల భాగస్వామ్యం పెంచడమే లక్ష్యం

**131వ రాజ్యాంగ సవరణ బిల్లు:**

లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుత జనాభా లెక్కల ద్వారా పునర్విభజన ప్రక్రియ

ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దుల పునర్వర్గీకరణ




# దేశానికి కొత్త దిశ

## మూడు కీలక బిల్లులు సభలోకి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులతోపాటు 131వ రాజ్యాంగ సవరణ బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ ప్రవేశపెట్టారు. ఇక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా యుటి చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కనీసం 12 గంటల పాటు చర్చ చేపట్టనున్నారు. ఒకవేళ సభ్యులు అంగీకరిస్తే సమయాన్ని పొడిగిస్తామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. తొలుత ఈ బిల్లులను మూజువాణీ ఓటు ద్వారా పాస్ చేశారు. కానీ విపక్షాల అభ్యంతరం నేపథ్యంలో మళ్లీ విభజన చేసి ఓటింగ్ నిర్వహించారు. 251 మంది అనుకూలంగా ఓటు వేయడంతో.. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ ప్రక్రియకు చెందిన రాజ్యాంగ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులను కలిపి సభలో ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ నేత వేణుగోపాల్ వ్యతిరేకించారు. రెండు బిల్లులను కలపడం మంచి విధానం కాదు అని, దీని వల్ల పరిణామాలు ఉంటాయని, ఒకవేళ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి >>2

మహిళలకు 33% రిజర్వేషన్, డీలిమిటేషన్, 131 రాజ్యాంగ సవరణ బిల్లులపై విస్తృత చర్చ

వాడావుడిగా బిల్లులెందుకన్న విపక్షాలు

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టమంటూ విపక్షాల ధ్వజం

ఒబిసి, ఇతర వర్గాలకు ఏవీ రిజర్వేషన్లని ప్రశ్న

విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్‌షా

నేడు ప్రధాని మోడీ సమాధానం, తర్వాత ఓటింగ్

మహిళాబిల్లు నాదికాదు..

# దేశప్రజలదే

## రాజ్యాంగ సవరణ బిల్లు అపూర్వం

డీలిమిటేషన్‌లో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు... నాదీ హామీ

రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వండి: లోక్‌సభలో ప్రధాని మోడీ



గురువారం లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని అన్నారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈబిల్లును30ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని >>2



## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య 10 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ నిర్ణయం యుద్ధమేఘాలు కమ్ముకున్న ఈ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఈ పది రోజుల వ్యవధిలో రెండు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం దౌత్యపరమైన >>2

# తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం

## రాష్ట్రంలో పెట్టుబడులు ప్రోత్సహించండి

### ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో భారీ అవకాశం

### యేటా వృద్ధి రేటు 30%, ఎగుమతుల్లో 103% నమోదు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్16:** ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం యూఎస్ నేషనల్ కాలేజ్ వార్ బృంద సభ్యులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం(ఏరోస్పేస్; డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిరేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు >>2



గురువారం మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయిన అమెరికా ప్రతినిధి బృందం





# తెలంగాణకు 26 సీట్లు

## ఎపికి 38 సీట్లు.. డీలిమిటేషన్‌తో రాష్ట్రాలకు నష్టం రాదు..

### లోక్‌సభలో కేంద్ర మంత్రి అమిత్ షా క్లారిటీ

### ఆ గణాంకాలను ట్వీట్ చేసిన కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్16:** లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవని, పైగా సంఖ్యాపరంగా, నిష్పత్తి పరంగా కూడా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయని నిర్దిష్ట లెక్కలతో సహా వివరించారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల సీట్లు కూడా పెరుగుతాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 స్థానాలు (23.76 శాతం) ఉండగా, సభ విస్తరణ తర్వాత 195 స్థానాలకు (సుమారు 23.97శాతం) పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 816 నుంచి 850కి పెంచి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల పార్లమెంటులో తమ ప్రాతినిధ్యం, ప్రాధాన్యత తగ్గుతుందని వాదిస్తున్నాయి. ఈ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. >>2

లోక్‌సభలో 272 సీట్లు మహిళలకే 5

## ఉస్మానియాలో వైద్య విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో పీజి జనరల్ సర్జరీ ప్రథమ సంవత్సరం మెడికల్ విద్యను అభ్యసిస్తున్న వైద్య విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడం పట్ల సంచలనంగా మారింది. ఆసుపత్రి ప్రాంగణం పిజి వైద్య విద్యార్థుల వసతి గృహంలోని రూమ్‌లో 10 మాత్రలు, ఇంజెక్షన్ చేసుకోవడంతో ఆపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న వైద్య విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రి క్యాజువాల్టీకి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. పనిఒత్తిడి కుటుంబీలను కాదనలేక బలవన్మరణానికి పాల్పడ్డారని పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. తాను కోరుకున్నది పిజి జనరల్ మెడిసిన్, అయితే >>2

## తేజస్వి వ్యాఖ్యలపై బిజెపి బేషరతు

# క్షమాపణ చెప్పాలి

### తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై కెటిఆర్ ఆగ్రహం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్16:** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ..బిజెపి చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయట పెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ >>2

గృహిణులకు రూ. 2500 ఓటర్లకు విజయ్ వరాలు 5

నేడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ఎన్డీయే అభ్యర్థిగా హరివంశ్ 5





# చిక్కుల్లో మక్క రైతులు

## కొనుగోలు కేంద్రాలు తెరవరు.. తెరిచినా కొనుగోళ్లు జరపరు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు నానా కష్టాలు పడుతున్నారు. సాగు సమయంలో యూరియా అందక ఇబ్బందులు పడిన రైతులు అనేక కష్టనష్టాలకోర్చి మొక్కజొన్నను పండించారు. అయితే ఇప్పుడు పండిన పంటను సైతం అమ్మాలంటే అంతకంటే ఎక్కువ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తెలంగాణలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11,21,494 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 29.79లక్షల టన్నుల మేర మొక్కజొన్న దిగుబడి రానుంది. కేంద్ర ప్రభుత్వం క్వింటా మక్కలకు రూ.2400ను మద్దతు ధరగా ప్రకటించింది. అయితే మక్కల కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఆశించిన సహకారం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మార్చి మూడో వారంలో కొనుగోళ్లను ప్రారంభించింది. కాని చాలా జిల్లాల్లో ఇప్పటి వరకు మక్క కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరవలేదు. మక్క కొనుగోలు కేంద్రాలు తెరవాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేస్తేనే అధికారులు దిగి వచ్చి తెరుస్తున్నారు. దీంతో రాష్ట్రంలో నిత్యం మక్క రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ఇక కొనుగోలు కేంద్రాలు తెరిచిన చోట్ల అరకొరగానే కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరాకు కేవలం 28 క్వింటాళ్ల వరకే కొంటామని నిర్వాహకులు అధికారులు ఆంక్షలువిధిస్తున్నారు. ఈఏడాది యాసంగిలో అనుకూల పరిస్థితులతో మక్క >>2



ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తే... 28 క్వింటాళ్లే కొంటామంటున్న మార్క్‌ఫెడ్

క్వింటాల్‌కు రూ.1800 మించి ధర పెట్టని ప్రయివేటు వ్యాపారులు



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన ఆస్ట్రియా ఛాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్

## తేజస్వి వ్యాఖ్యలపై బిజెపి బేషరతు క్షమాపణ చెప్పాలి

>> లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బిజెపి పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బిజెపి అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

## వైద్య విదార్థి ఆత్మహత్య

>> తొలిమలి, తృతీయ కౌన్సిలింగ్‌లలో కొరుకున్న విభాగంలో పిజి సీటు లభించలేదు. కుటుంబ సభ్యుల మాట కాదనలేక పిజి జనరల్‌సర్జరీలో చేరినా పని ఒత్తిడి,ఆత్మన్యూనతా భావానికి లోనయ్యారు. యువ వైద్యావిద్యార్థి బలవన్మరణానికి పాల్పడి తనువు చాలించాడు. ఓపి భవనంలో క్యాజువాల్టీలో నుంచి పోస్టుమార్టం కోసం మార్చురీకి శవాన్ని తరలించకుండా కుటుంబీకులు అడ్డుకున్నారు. మాకు న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం చేసేది లేదంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రికత్త నెలకొంది. భారీగా పోలీసులు మోహరింప చేశారు. ఈ కేసును అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బ్రాండ్ విశ్వవ్యాప్తం

>> అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం అని స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు.
కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐపీసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు 26 సీట్లు

>> దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాలని, జనాభాతో పాటు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వంటి ఆర్థిక సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్న విషయం తెలిసిందే. మరోవైపు, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ, తొలుత సీట్లు పెరిగినట్లు కనిపించినా, భవిష్యత్తులో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాల సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ చర్చల నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, అమిత్ షా పేర్కొన్న నియోజకవర్గాల గణాంకాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో పంచుకున్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్షాల అసత్య ప్రచారాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో వాస్తవ గణాంకాలతో తిప్పికొట్టారు. ప్రస్తుతం 5 దక్షిణాది రాష్ట్రాలకు 543 లోక్‌సభ స్థానాల్లో 129 స్థానాలు (23.76శాతం ) ఉన్నాయి.
లోక్‌సభ స్థానాలు 816కి పెంచితే, ఇవి 195 స్థానాలకు పెరుగుతాయి (23.90శాతం). అంటే సుమారు 50శాతం పెరుగుదల ఉంటుంది.
తెలంగాణకు ప్రస్తుతం మొత్తం లోక్ సభ స్థానాల్లో 17 సీట్లు (3.13శాతం ) ఉండగా.. పునర్విభజన తర్వాత 26 స్థానాలకు (3.18శాతం)కి పెరుగుతాయి అని ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. కొత్తగా చేపట్టే నియోజకవర్గాల డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు పెరగనున్న సీట్లు, శాతం వివరాలు ఇలా ఉన్నాయి.

| రాష్ట్రాలు | ప్రస్తుత సీట్లు | శాతం | డీ. సీట్లు% | శాతం |
|---|---|---|---|---|
| కర్ణాటక | 28 | 5.15శాతం | 42 | 5.15శాతం |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 4.60శాతం | 38 | 4.65శాతం |
| తెలంగాణ | 17 | 3.13శాతం | 26 | 3.18శాతం |
| తమిళనాడు | 39 | 7.18శాతం | 59 | 7.23శాతం |
| కేరళం | 20 | 3.68శాతం | 30 | 3.68శాతం |
| మొ.సీట్లు | 129/543 | 23.76% | 195/816 | 23.90% |

## చిక్కుల్లో మక్క రైతులు

>> దిగుబడి అనుకున్నదానికంటే ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు వచ్చింది. అయితే అధికారులు మాత్రం పాత లెకల ప్రకారం పంట కొనుగోలుకు పరిమితం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంట దిగుబడిన అంచనా వేయకుండా ఆంక్షలు విధించడం ఏంటని, మిగిలిన పంట ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలకు మక్కలను తీసుకొచ్చిన వారం, పది రోజుల తర్వాత అధికారులు కొనుగోళ్ల చేస్తుండడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. ఇందుకువ్యవసాయ, మార్క్‌ఫెడ్అధికారుల మధ్య సమన్వయ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నమోదు ఆధారంగానే కొనుగోలు చేస్తామని చెప్తూ అధికారులు తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఎకరాకు కేవలం 28 క్వింటాళ్ల మాత్రమే కొంటామని తెగేసి చెప్పుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కూరుకుపోతున్నారు. అదే సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చోట బస్తాలు సరిపడా లేకపోవడం, మక్కలకు అధికారులు అనేక కొర్రిలు పెడుతూ వెనక్కి పంపుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో పంటల సాగు నమోదైన మేరకు ఎకరాకు గరిష్టంగా 25 క్వింటాళ్లే నమోదు చేస్తామనే నిబంధనతో మిగిలిన పంటను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర మేరకు క్వింటా మక్క ధర రూ.2400 ఉన్నా ప్రైవేటు వ్యాపారులు క్వింటా మక్కలకు కేవలం రూ.1600 నుంచి రూ.1800లోపు మాత్రమే ధర పెడుతూ రైతులను అందినకాడికి దోచుకుంటున్న పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి షరతులు లేకుండా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో బస్తాలు, కాంటాలు సరిపడా అందుబాటులో లేవని, వెంటనే వాటిని సమకూర్చి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

## వారం - వర్జ్యం

17-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
● అమావాస్య సా.5.18
రేవతి ఉ.11.59
వర్జ్యం : లేదు
దు.ఉ.8.21-ఉ.9.11,
2) మ.12.31-మ.1.21
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. వస్త్రలాభం.

**వృషభం:** ఒక పనిని సన్నిహితుల సహాయంతో పూర్తిచేస్తారు. పెండింగ్ వ్యవహారాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** ఆరోగ్యపరమైన, కోర్టుపరమైన సమస్యల నుండి బయటపడతారు. విలువైన వస్తువులు సేకరిస్తారు. బంధువుల కలయిక.

**కర్కాటకం:** శుభకార్య నిర్వహణ, విద్యా సంబంధితమైన ఖర్చులు విషయమై ఋణాలు చేస్తారు. వాహనాలు కొనుగోలు.

**సింహం:** దుష్ప్రచారము ఇబ్బందిని కలిగించవచ్చు, తగు జాగ్రత్తలు పాటించండి. దైవము మీద భారము వేయండి.

**కన్య :** ముఖ్యమైన కార్యక్రమాలు, అమలు చేయు పనులు చర్చలు ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి. నూతన విద్యా అవకాశాలు.

**తుల :** మీరు ఆశించిన పదోన్నతి, సీటు మార్పిడి మొదలైన విషయాలు మీ దగ్గరకు వచ్చి దూరముగా జరిగిపోవచ్చును.

**వృశ్చికం:** తాత్కాలికముగా వెనుకబడినా ధర్మమే గెలుస్తుందన్న సత్యాన్ని గ్రహించండి. ధనాన్ని పొదుపుగా ఉపయోగిస్తారు.

**ధనుస్సు:** సోదర, సోదరీ వర్గములవారి నుండి కొన్ని ఆటంకములు ఎదురవుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**మకరం:** మీరనుకున్న చిన్నచిన్న పనులే పదేపదే త్రిప్పుట, శ్రమకు గురిచేయుట జరుగుతుంది. ఆరోగ్య విషయం జాగ్రత్త.

**కుంభం:** ఎక్కువ రోజులు ఇంటికి దూరముగా గడవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**మీనం:** భవిష్యత్తులో సుఖపడాలంటే కష్టించక తప్పదని భావిస్తారు. స్నేహితులను కలుసుకొని సహాయం అర్థిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దేశానికి కొత్త దిశ

>> పాలైతే, అప్పుడు దీంట్లో అర్థం ఏం ఉంటుందని వేణుగోపాల్ అన్నారు. రాజ్యాంగ సవరణకు, ఓ చట్టం సవరణకు జరిగే ఓటింగ్‌లో తేడా ఉంటుందని అమిత్ షా అన్నారు. ఒకటిపై ఒకటి ఆధారపడి ఉండడం వల్ల బిల్లులను కలిపి ప్రవేశపెట్టినట్లు మంత్రి చెప్పారు.
131వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. 15 నుంచి 18 గంటలు లేదా మీకు వీలైనంత సమయం చర్చించవచ్చు అని స్పీకర్ తెలిపారు.
దీంతో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై వాడీ వేడి చర్చ సాగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూడుకులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాల్సి అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.
ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్ల కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నా' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.
కానీ, కేంద్రం ఈ బిల్లులో వెనుకబడిన వర్గాల మహిళలకు, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా అమలు చేయాలని అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. కేంద్రం చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రక్రియ రాజ్యాంగా వ్యతిరేకం అని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా స్పందించారు. అఖిలేష్ మాటలకు కౌంటర్ ఇచ్చారు. మతం ఆధారంగా సీట్లు కేటాయించడం, చట్టసభలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగా వ్యతిరేకం అన్నారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం అంగీకరించబోదన్నారు. అంతగా కావాలనుకుంటే సమాజ్‌వాదీ పార్టీ తన సీట్లన్నీ ముస్లింలకే కేటాయించాలి అంటూ షా వ్యాఖ్యానించారు.
దీనిపై మరో ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్ స్పందిస్తూ షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. అఖిలేష్ స్పందిస్తూ.. ముస్లిం మహిళలు మన సగం జనాభాలో భాగం కాదా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అమిత్ షా మాట్లాడటం సరికాదన్నారు. అమిత్ షా, ఎస్పీ నేతల మధ్య వాదన సాగుతుండటంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, ఇరువురిని శాంతింపజేశారు.

**ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య: ఒవైసీ**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు.
ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం రాదు: అమిత్ షా**

దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పని, డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకు తగిన రీతిలో సీట్లు పెరుగుతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరించారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయమూ జరగదని అమిత్ షా స్పష్టం చేశారు.
డీలిమిటేషన్ తర్వాత ఏపీలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని అమిత్ షా వెల్లడించారు. అలాగే తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కి పెరుగుతాయన్నారు. ఇక, తమిళనాడులో 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెరుగుతాయన్నారు.
దక్షిణాది జనాభా శాతం కంటే సీట్లు ఎక్కువగా పెరుగుతాయని అమిత్ షా చెప్పారు. విపక్షాలు అబద్ధాలు చెబుతూ ప్రజలను అనవసరంగా ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. అన్ని ప్రాంతాలకూ సమాన న్యాయం జరుగుతుందని తేల్చి చెప్పారు.

**మోడీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం: ప్రియాంక**

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రసంగించారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బిజెపి నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు.
"ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోడీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకు?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు.
'మహిళా రిజర్వేషన్ బిల్లును ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోడీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు. ఆ బిల్లుపై క్రెడిట్‌ను మోడీ.. కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. దేశ మహిళలకు కాంగ్రెస్ ఎంతో సేవ చేసింది. బిల్లు విషయంలో మహిళలను బిజెపి తప్పుదోవ పట్టిస్తోంది. మహిళా బిల్లును ఎవరు వ్యతిరేకిస్తున్నారో మోడీ చెప్పాలి. కులగణనకు మోడీ ఎందుకు భయపడుతున్నారు? ఓబీసీలకు న్యాయం జరగాలి.. వారి హక్కులను ఎవరూ కాలరాయలేరు' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

**పునర్విభజన వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు: కేంద్ర న్యాయశాఖ మంత్రి**

దేశంలో మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల పునర్విభజనపై నెలకొన్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రాతినిధ్యాన్ని కోల్పోదని, అన్ని రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ భరోసా ఇచ్చారు.
నియోజకవర్గాల పునర్విభజన ద్వారా అన్ని రాష్ట్రాల్లోని స్థానాలను దాదాపు 50 శాతం మేర పెంచేలా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే భయాలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు.

**మా అభిప్రాయాన్ని ముందే చెప్పాం: సోనియా గాంధీ**

మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు.




మహిళారిజర్వేషన్ బిల్లుపై గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రణితి షిండే, ప్రభా మల్లికార్జున్ తదితరులు

## మహిళాబిల్లు నాదికాదు.. దేశ ప్రజలదే

>> పేర్కొన్నారు. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని అన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని పేర్కొన్నారు. 'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోడీ ప్రతిపక్షాలను హెచ్చరించారు.
మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ధి ఏ పార్టీకి దక్కదని అన్నారు. "అన్ని పార్టీలు మద్దతివ్వండి.
ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబిసి, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దాం" అని పార్లమెంట్ వేదికగా విపక్షాలకు ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబిసిలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.
'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు. దానికి రాజకీయ రంగు పూయవద్దు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశాం. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోడీకి కానీ దక్కదు. ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుంది. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోడీ విపక్షాలకు విజ్ఞప్తి చేశారు.
డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు.

## ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య కాల్పుల విరమణ

>> చర్చలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్, లెబనాన్‌లతో కలిసి పనిచేసే బాధ్యతను అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు అప్పగించినట్లు తెలిపారు. తాజా ఒప్పందంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా దళాల మధ్య జరుగుతున్న దాడులు నిలిచిపోనున్నాయి. రక్తపాతాన్ని ఆపి, అమాయకుల ప్రాణాలు కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అయితే, ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల ప్రతినిధులు 34యేళ్ల తర్వాత వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ అయ్యారని ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడానని ట్రూత్ పోస్ట్‌లో వెల్లడించారు. 1983 తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అర్థవంతమైన చర్చలు ఇవేనని ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్, లెబనాన్ రెండు దేశాలూ శాంతిని కోరుకుంటున్నాయని, ఈ సమస్య త్వరగా పరిష్కారమవుతుందని తనకు నమ్మకం ఉందని ట్రంప్ అన్నారు. ఈ కాల్పుల విరమణ మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బిల్లుల్లో ఏం ఉందంటే..

**1. డీలిమిటేషన్ బిల్లు:** లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ 850 స్థానాలలో, 815 స్థానాలను రాష్ట్రాలకు, 35 స్థానాలను కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించింది. ఈ మార్పులు 2029 లోక్‌సభ ఎన్నికల నుండి అమల్లోకి వస్తాయి.

**2. నారీ శక్తి వందన అధినియమ్ బిల్లు:** పార్లమెంటు చరిత్రలో మరో కీలక ఘట్టంగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ బిల్లును ప్రవేశపెట్టింది. 'నారీ శక్తి వందన అధినియమ్'గా ప్రసిద్ధి చెందిన రాజ్యాంగ (నూట ఆరవ సవరణ) చట్టం, 2023, లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా) దాదాపు మూడింట ఒక వంతు సీట్ల రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఎఎను సవరించి, ఆర్టికల్స్ 330ఎ, 332ఎ, 334ఎలను చేర్చింది. ఈ బిల్లు లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ, "లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ, జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ శాసనసభలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడమే" దీని ఉద్దేశ్యమని కేంద్రం పేర్కొంది. 'సదరు సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే సంబంధిత జనాభా లెక్కల ఆధారంగా మొదటి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టిన తర్వాతే అటువంటి రిజర్వేషన్ అమలులోకి వస్తుందని సదరు నిబంధనలు తెలియజేస్తున్నాయి," అని బిల్లులో పేర్కొంది.

**3. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు:** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక ఉన్న ఆవశ్యకతను వివరిస్తూ, 131వ సవరణ బిల్లు ఇలా పేర్కొంది, 'తదుపరి జనాభా లెక్కలు, ఆ తర్వాత జరిగే పునర్విభజన ప్రక్రియకు గణనీయమైన సమయం పడుతుంది, తద్వారా మన ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల సమర్థవంతమైన, అంకితభావంతో కూడిన భాగస్వామ్యం ఆలస్యం అవుతుంది. అందువల్ల, ఇటీవల ప్రచురించిన జనాభా లెక్కల గణాంకాల ఆధారంగా చేపట్టే పునర్విభజన ప్రక్రియ ద్వారా, లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభలలో, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, కేంద్రపాలిత ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌నుఅమలులోకి తీసుకురావడమేఈ ప్రతిపాదిత బిల్లు లక్ష్యం" లోక్‌సభలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటుతో మహిళలకు సీట్ల రిజర్వేషన్ ఎలా ముడిపడి ఉందో నొక్కిచెబుతూ, ఈ బిల్లు ఇలా పేర్కొంటుంది, మహిళలకు సీట్ల రిజర్వేషన్ అమలు అనేది, లోక్‌సభ, శాసనసభలలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటు అనే రాజ్యాంగ పథకంతో,డీలిమిటేషన్ కమిషన్‌ద్వారాప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి గీయడంతో ముడిపడి ఉంది.

## డీలిమిటేషన్ కుట్ర

### ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమేనన్న కేంద్ర ప్రభుత్వ వాదనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. 33 శాతం మహిళా కోటా అమలుతో ఈ డీలిమిటేషన్‌కు అసలు సంబంధమే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు ప్రధాని మోడీ పన్నే "రాజకీయ వ్యూహం" తప్ప మరొకటి కాదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాజ్యాంగ సవరణల ముసుగులో ప్రజల హక్కులను లాక్కోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నియోజకవర్గాల పటాలను బిజెపి మార్చబోతోందని ఆయన ఆరోపించారు.



## పార్లమెంట్ మాదిరిగా అసెంబ్లీలో సెంట్రల్ హాల్

### అధికారులకు మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి కీలక ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 16:** తెలంగాణ శాసన మండలి చైర్మన్ తన ఛాంబర్‌లో గురువారం ఆర్ అండ్ బి శాఖ,అఘాఖాన్ సంస్థ, తెలంగాణ లేజిస్లేచర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన మండలి లో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాల మేరకు శాసన మండలి, శాసన సభ మధ్యలో పార్లమెంట్ మాదిరిగా సెంట్రల్ హాల్ ఉండాలని, ఈ పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆయన తెలిపారు. శాసన మండలి సభ్యులకు , శాసన సభ సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్ డిజైన్ చేసి, పనులను త్వరగా ప్రారంభించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, చైర్మన్ ఓ.యస్.డి గోవర్ధన్ రెడ్డి , పియస్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్‌సెట్-2026 దరఖాస్తు గడువు 22 వరకు పొడిగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడి కాలేజీల్లో చేరడానికి నిర్వహించే ఎడ్ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడిగించారు. దరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు ఉండగా అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును అపరాధ రుసుం లేకుండా ఈ నెల 22 వరకు పొడిగిస్తున్నట్టు ఎడ్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ సెట్-2026 పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనున్న సంగతి తెలి సిందే. ఫిబ్రవరి 20న నోటిఫి కేషన్‌ను జారీ చేయగా ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖా స్తులను స్వీకరించడం ప్రారం భించారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణకు తుది గడువుగా ప్రకటించారు. అపరాధ రుసుం రూ. 250తో ఈ నెల 22 వరకు తుది గడువుగా ఉండగా... అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 22 వరకు పొడిగిం చినట్టు కన్వీనర్ తెలిపారు.

## దేవరకొండలో ఏసిబి మెరుపుదాడి

### రూ.30 వేల లంచం తీసుకుంటూ

### రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విద్యుత్ ఎడిఇ

**దేవరకొండ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** దేవరకొండలో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడి నిర్వహించి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఉండగా ఆయనను అదుపులోకి తీసుకోవడం సంచలనం రేపింది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి: గత ఏడాది అక్టోబర్ 29న కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా కంబాలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కెవి విద్యుత్ లైన్ తీవ్రంగా దెబ్బతింది. అనంతరం ఆ లైన్ పునరుద్ధరణ పనులను ఒక కాంట్రాక్టర్ పూర్తి చేశాడు. ఈ పనులకు సంబంధించిన సుమారు రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి, ఉన్నతాధికారులకు పంపించాల్సిన బాధ్యత ఏడీఈ సైదులుదే.అయితే బిల్లును ముందుకు పంపేందుకు ప్రతిఫలంగా సైదులు రూ.30,000 లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి ప్రణాళిక ప్రకారం గురువారం కాంట్రాక్టర్ నగదు అందజేస్తుండగా, ముందుగానే మాటు వేసిన ఏసీబీ నల్గొండ రేంజ్ అధికారులు సైదులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం సైదులను అరెస్ట్ చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కు

## ఎపి మంత్రి లోకేష్ ధన్యవాదాలు

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన నన్ను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసిన ఉప ముఖ్యమంత్రి పవనన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ లోకేష్ ట్వీట్ చేసారు. మీ ఆశీస్సులతో, మీ ఆకాంక్ష మేరకు కూటమి స్ఫూర్తి మరింత స్నేహ పూర్వ కంగా.. సమన్వయంతో, రాష్ట్ర ప్రగతిప్రజా సంక్షేమం లక్ష్యంగా కొనసాగుతుంది. తమ్ము డిగా నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కుంటాను. సోదరుడిగా మీరు చూపిస్తున్న అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు అని లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేష్ ఎంపికైన సందర్భంగా డీసీఎం పవన్ కల్యాణ్ ఆయనను అభినందించారు. కొత్త బాధ్యతల్లో లోకేశ్ సఫలీకృతులు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కూటమి స్ఫూర్తిని సమర్థంగా కొనసాగిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

### ఇందిరమ్మ ఇంటి కోసం కలెక్టర్ ఎదుట

## మహిళ ఆత్మహత్యాయత్నం

**మునగాల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమక్షంలో మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఓ మహిళఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటగురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, స్థానిక రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి, ప్రణాళిక మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం మరో కార్యక్రమానికి హాజరుకావడానికి వెళ్లే క్రమంలో, మండల పరిధిలోని తాడువాయి గ్రామానికి చెందిన కోట సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చింది. తన పేరుతో 2008 సంవత్సరంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని తన ప్రమేయం లేకుండా అదే పేరుగల మరో మహిళకు కేటాయించారని, ఇప్పటికే రూ.28 వేల బిల్లులు డ్రా చేసినట్లు ఆమెఆరోపించింది. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.తనకు నేటికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె, మరోసారి కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లే క్రమంలో అసహనానికి లోనై తన చేతి సంచిలో తెచ్చుకున్న పురుగుల మందును సేవించింది. దీంతో సమావేశ ప్రాంగణంలో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మహిళను అడ్డుకునే క్రమంలో ఆమె వద్ద ఉన్న పురుగుల మందు చిందడంతో, పక్కనే ఉన్న కలకోవ గ్రామానికి చెందిన విబికే పనస లక్ష్మయ్యతో పాటు కలెక్టర్ భద్రతా సిబ్బంది కళ్లలో పడటంతో వారు అస్వస్థతకు గురయ్యారు.వెంటనే సమావేశ స్థలంలో ఉన్న సీఐ రామకృష్ణారెడ్డి స్పందించి బాధిత మహిళ సునీతను పోలీసు వాహనం లో హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సహాయం అందించారు. చికిత్స అనంతరం ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు సమాచారం.

# ఐదు వర్సిటీలకు కొత్త ఈసీలు

### ఉస్మానియా, జెఎన్‌టియు, ఎస్‌యు, టియు, ఓపెన్ వర్సిటీలకు ఈసీల నియామకం

### పెండింగ్‌లో నాలుగు వర్సిటీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఐదు విశ్వవిద్యాల యాలకు కార్యానిర్వాహక మండలి(ఈసీ) సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడున్నర సంవత్స రాల తరువాత యూనివర్సిటీలకు ఈసీలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా, జేఎన్‌టియు, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీలతోపాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెనన యూనివర్సిటీలకు ఈసీలను నియమిస్తూ విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ యూనివర్సిటీకి ఇప్పటికే ఈసీని నియమించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని జేఎన్ఏఎఫ్ఏయు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ యూనివర్సిటీలకు ఈసీలను నియమించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం జారీ చేసిన జీవోల్లో ఈసీ సభ్యులుగా నియమితులైన వారి పదవికాలం ఎప్పటి వరకు ఉంటుందనేది చెప్పలేదు. వాస్తవంగా ఈసీ పదవి కాలం సాధారణంగా మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అయితే ఈ విషయాన్ని ప్రభుత్వం జీవోలో వెల్లడించ లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సుమారు రెండున్నర సంవత్సరాల తరువాత యూనివర్సిటీలకు ఈసీలను నియమించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్‌ఛాన్సలర్(వీసీ)లను నియమించి ఏడాది గడిచిన తరువాత ఇపుడు ఈసీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉస్మానియా యూనివర్సిటీ క్లాస్-2 మెంబర్స్‌గా ఈసీలోకి ప్రొఫెసర్ పి.ఉషారాణి, ప్రొఫెసర్ ఎం.విజ్జులత, డాక్టర్ తుమ్మలూరి శ్రీలక్ష్మి, బి.సుజాత నాయక్, డాక్టర్ జె.నీరజ, డాక్టర్ బాణాపురం మధుసూదన్ రెడ్డి, నర్రి యాదయ్య, సురం రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డిలను నియమించారు. జేఎన్‌టియు క్లాస్-2 ఈసీ సభ్యులుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులైన నలుగురు సభ్యులుగా డాక్టర్ ప్రకాష్, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు, శ్రీనివాస మూర్తిలను నియమించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్లాస్-2 ఈసీ సభ్యులుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులైన నలు గురు సభ్యులుగా సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి నిత్యానందరావు, టి సాట్ సీఈవో బి వేణుగోపాల్ రెడ్డి, బి వెంకటేశ్వరరావు, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా రావులను నియమించారు. శాతవాహన యూనివర్సిటీ క్లాస్-2 ఈసీ సభ్యులుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులైన నలుగురు సభ్యులుగా వంగాల మురళీ మోహన్, కవిత ఆలేటి, ఊట్కూరి రవీందర్ రెడ్డి, శ్రీపురం ఈశ్వర్‌లను నియమించారు. తెలంగాణ యూని వర్సిటీ క్లాస్-2 ఈసీ సభ్యులుగా వివిధ రంగా ల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులైన నలుగురు సభ్యులుగా చెరుకూరి రజనీకాంత్, అల్లే లావణ్య, మహ్మద్ ఘజీ, డాక్టర్ ఎస్ జయంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# విద్యుత్ ఆర్టిజన్ల తొలగింపు!

### ఎస్మా ప్రయోగించిన సర్కార్

### విద్యుత్ సంస్థల్లో ఉద్రిక్త పరిస్థితులు

### 9వ రోజుకు చేరుకున్న సమ్మె

### విద్యుత్ సరఫరాకు తీవ్రఅంతరాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తెలంగాణలో విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె తీవ్రరూపం దాల్చింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ సమ్మె గురువారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. దీనివల్ల రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రభుత్వం ఎస్మా హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆర్టిజన్లు సమ్మె చేస్తూ తమ ఆందోళనలను ఉధృతంగా కొనసాగిస్తున్నారు. డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఆర్టిజన్లపై విద్యుత్ సంస్థలు కొరడా ఝులిపిస్తున్నాయి. ఆర్నెళ్ల పాటు సమ్మెలపై నిషేధం అమలులో ఉన్నందున విధులకు హాజరు కాకపోతే ఆర్టిజన్లను తొలగిస్తామని విద్యుత్ సంస్థలు అల్టిమేటం ఇచ్చాయి. సమ్మెలో పాల్గొనడం సేవా నియమావళి ఉల్లంఘనగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. గురువారం ఉదయం 11 గంటలలోపు విధుల్లో చేరకపోతే (డీమ్డ్ టూ టెర్మినేషన్) ఉద్యోగాల నుంచి తొలగించినట్లుగా పరిగణనలోకి తీసుకుంటామని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్కో) హెచ్చరించినా వాటిని పెడచెవిన పెట్టడంతో టెర్మినేట్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని అంతర్గతంగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు కూడా సమ్మెలో ఉన్న ఆర్టిజన్లు 24 గంటల్లోగా విధుల్లో చేరాలని నోటీసులు జారీ చేశాయి. అంతేకాకుండా కార్మికుల తొలగింపునకు చర్యలు చేపట్టాయి. మరోపక్క పాల్వంచ కేటీపీఎస్‌లో సమ్మెలో ఉన్న 51 మంది ఆర్టిజన్లను విధుల్లో నుంచి తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదేవిధంగా 2023లో కూడా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేసిన సుమారు 200 మందిని తొలగించాయి. కాగా ఇదే సమయంలో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాధిపతులకు ఇప్పటికే విద్యుత్ సంస్థలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. సమ్మెపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ ఉత్తర, దక్షిణ డిస్కంలు, జెన్ కో, ట్రాన్స్ కో నుంచి గానీ చర్చలకు అధికారికంగా ఎలాంటి పిలుపు రాలేదు. సమ్మె ప్రభావం పడకుండా అధికారులు పలు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆర్టిజన్లను తొలగించేందుకు విద్యుత్ సంస్థలు తీసుకున్న నిర్ణయంపై కార్మికసంఘాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామంతో విద్యుత్ సంస్థలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో సమ్మెలో పాల్గొంటున్న దాదాపు 20 వేల మంది ఆర్టిజన్లను తొలగించినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశాయి. కాగా సమ్మె చేస్తున్న ఆర్టిజన్ల తొలగింపుపై అంతర్గత ఆదేశాలు ఇచ్చారనేదానిపై ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సిఎండిలను వివరణ కోరే ప్రయత్నం చేసినా, వారి నుండి స్పష్టత రాలేదు.

# కాంగ్రెస్, బిజెపి దొంగ ఓట్లు నమోదు చేసే ప్రమాదం

### ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు

### బిఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నం చేయాలి

### ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై

### పార్టీ శ్రేణులతో కెటిఆర్ టెలికాన్ఫరెన్స్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 16:** త్వరలో తెలంగాణలో జరగనున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం పైన దృష్టి సారించి, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడకుండా చూడాలని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఇప్పటికే ఎన్నికల సంఘం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకొని అనేక రాష్ట్రాల్లో లక్షలాది ప్రతిపక్ష పార్టీల ఓట్లను బిజెపి తీసివేసిందన్న ఆరోపణలు విస్తృతంగా తలెత్తుతున్నాయన్నారు. దీనితో పాటు తాజాగా మొన్నటి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేర్పించి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా లబ్ధి పొందిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు గుర్తు చేశారు.

బిజెపి, కాంగ్రెస్ లు కచ్చితంగా ఈ సర్ కార్యక్రమం దుర్వి నియోగం చేసే ప్రమాదం రాష్ట్రంలో ఉన్నదని, దీని పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు తమ ఓట్లను కాపాడుకోవడంతో పాటు దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలన్నారు. త్వరలో జరగనున్న సర్ కార్యక్రమం పైన పార్టీ శ్రేణులకు గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ వారీగా దొంగ ఓటర్లను తొలగించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువకుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ తరఫున నియమించబడే బూత్ లెవల్ ఏజెంట్లు ప్రయత్నం చేయాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ప్రభుత్వం చేత నియమించబడే బూత్ లెవల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకోవడం, కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ వంటి ప్రధానమైనటువంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుందన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మండిపోతున్న ఎండలు

### మధ్యాహ్నం వేళల్లో బయటకు రావొద్దు

### వాతావరణ శాఖ హెచ్చరిక

### తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తెలంగాణవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో ఉదయం 10 గంటలకూ బయటకు వచ్చేందుకు జనాలు జంకుతున్నారు. పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలోనే రాబోయే రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రస్తుతం ఉన్న దానికన్నా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల వరకు రికార్డు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనికి తోడు పలు జిల్లాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండటానికి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు.

# డిఇఇ సెట్-2026కు 32,611 దరఖాస్తులు

### ముగిసిన దరఖాస్తు గడువు.. నేడు, రేపు ఎడిట్ సౌకర్యం

**హైదరాబాద్,, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిడీఈఈ సెట్-2026)కి సంబంధించి 32,611 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 15తో దరఖాస్తు గడువు ముగిసిన నేపథ్యంలో డీఈఈ సెట్‌కి దరఖాస్తు వివరాలను డీఈఈ సెట్-2026 కన్వీనర్ జి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 15 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారం భించామని .. ఈ నెల 15తో దరఖాస్తు గడువు ముగిసిందని తెలిపారు. దరఖాస్తు గడువు ముగిసే నాటికి 32,611 దరఖాస్తులు వచ్చాయి. అందులో తెలుగు మీడియం నుంచి 12,384, ఇంగ్లీష్ మీడియానికి 18,993, ఉర్దూ మీడియంకి 1234 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

నేడు (శుక్రవారం), రేపు(శనివారం) రెండు రోజులు దరఖా స్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (డీఈఎల్.ఈడీ) (మైనారిటీ, నాన్ మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆన్‌లైన్ విధానం ద్వారా టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోసం దరఖాస్తు లను ఆహ్వానిస్తూ ఫిబ్రవరి 27న నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డీఈఈ సెట్ పరీక్షను మే 21, 22 తేదిల్లో నిర్వహించ నున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ. 450 ఫీజు కాగా.. ఇతరులకు రూ. 500గా నిర్ణయించారు. ఇతర వివరాలకు 8317567404 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## కాశీలో పర్యటిస్తున్న కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** త్వరలో కొత్త పార్టీని ఏర్పాటు చేయ బోతున్న నేపథ్యంలో తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత కాశీలో పర్యటిస్తున్నారు. అక్కడ గంగానదిలో పవిత్ర స్నానం ఆచ రించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 25న ఆమె కొత్త పార్టీపై ప్రకటన చేయబో తున్నారు. తన పార్టీ జెండా, అజెండాలో నీలిరంగు ఉంటుందని కవిత ఇదివరకే ప్రకటించారు. తెలంగాణ ప్రజాజాగృతి పేరు నమోదు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు.

## తెలంగాణ గిరిజన వ్యాపారులను సన్మానించిన కేంద్రం

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గిరిజన తెగల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న విభాగంలో తెలంగాణకు చెందిన ఆదివాసి, గిరిజన వ్యాపారులను కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. జాతీయ షెడ్యూల్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి) 25వ వార్షికోత్సవం ఢిల్లిలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువాల్ ఓరమ్ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లాకు చెందిన సంగెం చంద్రకళ (చీరలు, జనరల్ స్టోర్ విభాగం), నల్గొండ జిల్లా నానవత్ చాండి (బంజార హస్తకళల విభాగం)లో అవార్డులు అందుకున్నారు.

### డీలిమిటేషన్, నామినేటెడ్ పోస్టులు, కులగణన నివేదికలపై

## మీనాక్షి నటరాజన్‌తో మహేష్‌కుమార్‌గౌడ్ భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, చట్టసభల్లో మహిళ రిజర్వేషన్‌బిల్లు వంటి అంశాలతోపాటు రాష్ట్రపార్టీ కార్యవర్గం సంస్థాగత విస్తరణ, నామినేటెడ్ పోస్టుల పందేరంకు అనుసరించాల్సిన విధివిధానాలను ఇద్దరు చర్చించారు. ముఖ్యంగా ఇటీవల వలసవచ్చిన ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తితో మాట్లాడటంపై కూడా ఇద్దరి నేతల్లో చర్చకు వచ్చినట్లు తెలిసింది. జగిత్యాల జిల్లాకు చెందిన జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో నష్ట నివారణ చర్యలు తీసుకోవడానికి అనుసరించాల్సిన విధానం పైకూడా సమాలోచనలు చేసినట్లు తెలిసింది. పార్టీపై పూర్తిగా పట్టుసాధించి ఎక్కడికక్కడ అసంతృప్తులను దారిలోకి తెచ్చుకోవాల్సిన అవసరంపై వారు సమావేవంలో చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రం ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికల వివరాలపై కూడా వారిరువురు విశ్లేషణ చేశారు.

## హైకోర్టులో పైలట్ రోహిత్‌రెడ్డి బెయిల్ పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** డ్రగ్స్ కేసులో అరెస్టై చంచల్‌గుడా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. పరిశీలించిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పైలెట్ రోహిత్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రోహిత్ రెడ్డి ఏ2 గా ఉన్నారు. ఇప్పటికే ఉప్పర్‌పల్లి కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో పోలీసులు రోహిత్‌రెడ్డిని ఇప్పటివరకు 2 సార్లు కస్టడీలోకి తీసుకొని విచారించారు.

## రేపు మేడిగడ్డకు వెళ్లనున్న బిఆర్ఎస్ నేతల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** ఈనెల 18న బీఆర్ఎస్ నేతల బృందం మేడిగడ్డకు వెళ్లనుంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల బీఆర్ఎస్ నేతలు మేడిగడ్డను పరిశీలించనున్నారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ భేటీలో బ్యారేజీని సందర్శించాలని నిర్ణయించారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులను ప్రభుత్వం నిరక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. పరిస్థితులను పరిశీలించేందుకే 18న బ్యారేజీ వద్దకు వెళ్లనున్నారు.

## ఎస్సీ యువతకు సబ్సిడీతో ఈవీ వెహికల్స్

### పైలట్ ప్రాజెక్ట్‌గా రూ.219 కోట్లతో 10 వేల మంది ఎంపిక

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ ఎస్సీ యువతకు భారీ శుభవార్త అందించింది. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఆర్థిక సాయం అందించాలని తాజాగా నిర్ణయించింది. అందులో భాగంగా ఈకామర్స్, లాజిస్టిక్స్ రంగంలోకి అడుగుపెట్టాలనుకునే యువతకు ప్రోత్సాహం అందించేందుకు ముందడుగు వేసింది. ఈ మేరకు యువతకు భారీ సబ్సిడీతో తక్కువ ధరలకు ఈవీ వెహికల్స్‌ను అందించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఇప్పటికే యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా వచ్చే వారం నుంచి లబ్దిదారులను ఎంపిక చేయనుంది. అనంతరం అర్హులైనవారికి వెహికల్స్‌ను పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. పైలట్ ప్రాజెక్ట్ కింద తొలుత 10 వేల మందికి వీటిని అందించనుంది.

## అందరికీ శుభాలు కలగాలి

### బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు వేడుకున్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకో గలుగుతున్నారన్నారు. గురువారం ఉదయం ఆమె కుటుంబసభ్యులతో కలసి విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి చేరుకున్నారు.కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 25 నుండి తిరుమలలో పద్మావతి పరిణయోత్సవాలు

### ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠం వదలి భూలోకం చేరిన సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామి నారాయ;ణపురంలో పద్మావతిదేవిని వివాహమాడిన ఘట్టాన్ని తలపించేలా తిరుమలలో ఈనెల 25నుండి 27వరకు మూడురోజులు పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు జరిపించనున్నారు. టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు ఈ ఘట్టాన్ని ప్రతి ఏడాది శుభముహూర్తంలో జరిపిస్తుండటం పరిపాటి. పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈనెల 25 నుండి 27 తేదీ వరకు మూడురోజులు తిరుమలలో జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై నారాయణ ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి చేరుతారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం ఘట్టం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. -ఆర్జిత సేవలు రద్దు : పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా 25 నుండి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

వార్త


దుఃఖం అనేది శిక్ష కాదు. సంతోషం అనేది వరమూ కాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

- ఆర్. జి. ఇంగర్సాల్

# పతనం అంచున ప్రజారోగ్యం!

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వంకానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇన్నేళ్లు గడిచిపోయినా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్తకొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్న మొన్నటి వరకు ప్రపంచాన్ని చిగురుటాకుల వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు దాని నుంచి బయటపడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కోలుకోలేకపోతున్నారు. కిడ్నీ సమస్యలు పెరిగిపోయాయి. గుండెజబ్బులు విస్తరిస్తున్నాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్నిపెట్టినా సరిపోవడంలేదు. వయసుతో సంబంధం లేకుండా నెలల పిల్లల నుండి డెబ్బైయేళ్ల వృద్ధుల వరకు గుండెజబ్బులు ఎప్పుడు, ఏ రూపంలో వచ్చి బలితీసుకుంటాయో తెలియడం లేదు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. వీటిని నియంత్రించేందుకు అధికార వర్గాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక దోమలు వీరవిహారం చేస్తున్నాయి. దోమను జయించడం సాధ్యం కాదేమోననిపిస్తున్నది. వీటితోపాటు గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఒక్కటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక్కో అల్లోపతి డాక్టర్లే కాదు ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాల్సిందిగా సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈవిషయం కొత్తగా చెప్పడంలేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలియంది కాదు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? పరిశీలించాల్సిన సమయం ఇది. రోగనిరోధక శక్తి ఒక్కరోజులో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏ మేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో అల్లాడిపోతున్న వారిలో అధిక శాతం నిరుపేదలే. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటించే వారు భారత్‌లో కోట్లసంఖ్యలో ఉన్నారు. వారిలో రోగ నిరోధక శక్తి ఎలా వస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? మరొకపక్క కాలుష్యం ప్రజారోగ్యాన్ని కాటు వేస్తున్నది. వాయు, నీటి కాలుష్యాలు అదుపు తప్పిపోతున్నాయని చెప్పొచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అదుపు తప్పడంతో పాఠశాలలకు సెలవులు ఇవ్వడమే కాదు ఉద్యోగులను వర్క్‌ఫ్రం హోమ్‌కుపరిమితం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీలోచలికాలంలోవాయు కాలుష్యం చుట్టుముట్టడం ఆ పౌరులను ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రతియేడాది జరుగుతున్నదే. ఢిల్లీ ఒక్కటేకాదు భారతదేశంలోని అనేక నగరాలు, పట్టణాలువాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. దీన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావడం లేదు. మరొకపక్క వాహన కాలుష్యం దీనికి తోడవుతున్నది. కాలం చెల్లిన కోట్లాది వాహనాలు నిర్ణీత స్థాయి కంటే మించి పొగను వెదజల్లుతూ రోడ్లమీద తిరుగుతున్నాయి. అన్నిటి కంటే మించి కేన్సర్ వ్యాధి మానవాళిపై పంజా విసరడం ఆందోళన కలిగిస్తున్నది. దీని బారిన పడి లక్షలాది మంది ఆర్థికంగా చితికిపోతుంటే మరికొందరు సకాలంలో సరైన వైద్యం అందకప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. యాభైయేళ్ల వయసు రాకముందే మహిళలు, పురుషులు, రకరకాల కేన్సర్ల బారినపడుతుండడానికి వారి జీవన శైలి, సంబంధిత అలవాట్లు ప్రధాన కారణమని వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. అలవాట్లను, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా కేన్సర్ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. మరొకపక్క పెరుగుతున్న ధూమపానం కూడా ఈ కేన్సర్‌ను పెంచేందుకు దోహదపడుతున్నది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం వల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక కేన్సర్ల నుండి తప్పించుకోవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. అయితే దీనిపై ప్రజలకు అవగాహన పెంచేందుకు చేస్తున్నప్రయత్నాలు క్షేత్రస్థాయిలో అందాల్సిన వారికి అందడంలేదు. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియందికాదు. ప్రజా సంక్షేమమే లక్ష్యమని చెప్పుకునే పాలక పెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇవే కాదు కల్తీ కూడా ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజారోగ్యాన్ని పతనం అంచుకు తీసుకుపోతున్నాయి. పాలకులు ఇప్పటికైనా మనసు పెట్టాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచి ప్రజా అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రులు, సిబ్బందిని పెంచి కనీస వైద్య సదుపాయాలు అందించాల్సిన అవసరం ఉంది.

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు, ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



హెన్రీఫోర్డ్

గొప్ప త్యాగాలు చేయగలిగినప్పుడే గొప్ప పనులు చేయగలం.



స్వామి వివేకానంద

# బిసి మహిళలకూ రిజర్వేషన్లు అవసరం

**చట్టసభలలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదానికి అన్ని వర్గాలు సహకరించాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. కాగా ఈ బిల్లుల ఆమోదం కోసం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలతో ప్రభుత్వ వర్గాలు చర్చలు జరిపాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసేంతవరకు ఈ బిల్లుపై చర్చ వద్దని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకెళ్లడం గమనర్హం. దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాల్లో చీలిక తీసుకొచ్చి అయినా సరే ఈ బిల్లులను ఆమోదింప చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.**



డా. కావలి చెన్నయ్య

భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అనేవి సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, సమాజానికి దూరంగా, చారిత్రాత్మకంగా అణచివేయబడ్డ వెనుకబడిన వెట్టి వర్గాల ప్రజలకు విద్యా, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యాలలో సమానత్వం సాధించడానికి రాజ్యాంగపరంగా చేసిన ఏర్పాటు. అలాంటి రిజర్వేషన్లు సామాజికంగా నెట్టివేయబడ్డ అన్ని వర్గాల వారికి కల్పిస్తేనే సమ సమాజ ప్రజాస్వామ్యం ఏర్పడుతుంది. పెరియార్ రామస్వామి నాయకర్ అభిప్రాయం ప్రకారం 'విద్యా, ప్రజాసేవలో ఒక వైదికోత్తమ కులం అసమాన ఆధిపత్యం కారణంగా న్యాయమైన ప్రాతినిధ్యం ఉండేలా రిజర్వేషన్ అవసరమైందని' అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో అన్నివర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం లేనంతవరకు అది ప్రజాస్వామ్యం అనబడదు. ఎందుకంటే తరతరాల సామాజిక అంతరాల సమాజంలో కొందరు మాత్రమే పాలకులవుతున్నారు. సామాజికంగా వెనకకు నెట్టివేయబడ్డ అధిక భాగం ప్రజలు పాలితులుగానే కాలమెల్ల దీస్తున్నారు. మనదేశంలో ఇప్పుడున్న శాసన, పార్లమెంటు నియోజకవర్గాలు 1971 లెక్కల ప్రకారం ఏర్పరిచినవి. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 81, ఆర్టికల్ 55 లకు కీలక సవరణలు చేపడుతూ 2011 జనాభా లెక్కల ప్రామాణికత ఆధారంగా అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాల పునర్విభజన చేపట్టి ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలను 850కి పెంచి, రాష్ట్రాలకు 815, కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 ఎంపీ స్థానాలు కేటాయించి, అసెంబ్లీ స్థానాలు 4123 నుండి 6,185 వరకు పెంచి, అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల నుండి 33 నియోజక వర్గాలను మహిళలకు కేటాయించనున్నారు. మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం సంతోషమే కానీ ఈ 33శాతంలో బిసి మహిళలకు కూడా కనీసం 50శాతం రిజర్వేషన్ కల్పించకపోతే 47 కోట్లకు పైగా ఉన్న మహిళా, 50 కోట్లకు పైగా ఉన్న పురుష ఓటర్ల అంటే మొత్తం 97 కోట్లకు పైగా ఉన్న ఓటర్లలో 50 కోట్లకు పైగా ఉన్న బీసీ ఓటర్ల హక్కుకు విలువ లేకుండా రాజకీయంగా మరీ వెనకకు నెట్టబడతారు. కానీ నేడు బీసీ ఓట్లను వాడుకొని సీట్లు గెలుచుకునే రాజకీయ పార్టీలు, నాయకులు మహిళ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉండాలని ఒక్కరు పల్లెత్తు మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం. బీసీ ప్రజాప్రతినిధులందరూ బీసీ మహిళలకు తప్పకుండా రిజర్వేషన్ కావాలని చట్టసభలలో గొంతేతాల్సిందే. లేనియెడల బిసి వ్యతిరేక పార్టీలు, నాయకులు బీసీలను పాలక పక్షంలోకి ఎప్పటికీ ముందుకు రానివ్వవు. నాటి సమాజ్వాది పార్టీ నాయకుడు ములాయం సింగ్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్, జనతాదళ్ నాయకుడు శరత్ యాదవ్‌లు మాత్రమే బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉండాల్సిందేనని గట్టిగా వాదించారు. వీరిలో ఒక లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే జీవించి ఉన్నారు. వయసు రీత్యా ఆయన ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. బీసీ వర్గాల నుంచి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యమే లేకపోతే వారి గొంతు పార్లమెంటు, అసెంబ్లీలో వినిపించకపోతే ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడిది? నాటి నుండి నేటి వరకు మిగతా రాజకీయ పార్టీలు బిసి మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు కావాలని మాట వరసకైనా మాట్లాడడం లేదు అంటే బీసీలపట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో ఇట్టే అర్థమవుతున్నది. 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా పరిధిలోకి రాని ఆర్థికంగా



బలహీనమైన అగ్రవర్ణాల వారికి ఆర్టికల్ 15,16లను సవరించి 8లక్షలవరకు వార్షికాదాయం, 5ఎకరాల వరకు వ్యవసాయ భూమి, గుర్తించిన మునిసిపాలిటీలో 100/200 గజాల వరకు ఇల్లు ఉన్నటువంటి వారికి ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2022లో సుప్రీం 5గురు న్యాయమూర్తుల ధర్మాసనం 3:2 తీర్పుతో 103వ సవరణ ద్వారా ఈడబ్ల్యూఎస్‌కు 10శాతం రిజర్వేషన్ సబబే అంటూ రిజర్వేషన్లకు ఆర్థిక కారణాలు ప్రాతిపదిక కాగలవని చెప్పి ఇది రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘించదని తీర్పిచింది. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదన్న ఇదే కోర్టు నిబంధన ఎటుపోయిందో అర్థం కావడం లేదు. ఈడబ్ల్యూస్ వర్తించడానికి గల ప్రమాణాలు ఏవైతే ఉన్నాయో అవి ఉన్న బీసీలకు క్రిమిలేయర్ వర్తించడం చూస్తే చట్టం ఉన్నవాడి చుట్టం అయిందని అర్థమవుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం మొత్తంగా 10 శాతం జనాభా ఉన్న అగ్రవర్ణాలలో నుండి పేదలకు అంటే వారు 10 శాతం కంటే తక్కువ ఉంటారు అయినప్పటికీ వారికి 10 శాతం రిజర్వేషన్. నాటి మొరార్జీ దేశాయి ప్రభుత్వం 1979లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు బిందెశ్వర్ ప్రసాద్ మండల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిషన్ బీసీలు 52శాతం పైనే అని తేల్చి 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసింది. ఆ సిఫారసుల మేరకు 1990లో నాటి ప్రధాని విశ్వనాథ ప్రతాప్ సింగ్ 27శాతం రిజర్వేషన్లను అమలు చేయ నిర్ణయించినప్పుడు దేశవ్యాప్తంగా నిరసన చేశారు. అగ్రవర్ణాల వారు, బీసీ వ్యతిరేక నేటి బిజెపి పార్టీ నాటి సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు కూడా ఉపసంహరించుకుని ప్రభుత్వాన్ని పడగొట్టింది. మండల కమిషన్ అమలుకు వ్యతిరేకంగా ఆనాడు దేశవ్యాప్త ఆందోళన చేసిన వర్గాలు లేవనెత్తిన అంశం 'ఉన్నత విద్యా, ప్రభుత్వ సేవా రంగాలలో రిజర్వేషన్లు ప్రతిభా సామర్థ్యానికి భంగం కలిగిస్తాయని, కుల ఆధారితమైన రిజర్వేషన్లు కులాన్ని ప్రోత్సహించేవిగా, సమాజంలో విభజనకు దారి తీసేవిగా మారాయని, కొన్ని సార్లు ఎక్కువ యోగ్యత ఉన్నప్పటికీ తక్కువ యోగ్యత ఉన్నటువంటి వారికే ఎంపికకు దారితీసి, సామర్థ్యం నాణ్యతను దెబ్బతీయవచ్చు' అని అన్నవారు దేశ భవిష్యత్తును నిర్ణయించి చట్టాలు చేసే చట్టసభలలో ఆ వర్గాలకు మహిళల పేరిట వారికి లభిస్తున్న రిజర్వేషన్లు మాకు వద్దు అని ఎందుకు అనడం లేదు. చట్టసభలలో మహిళ రిజర్వేషన్ల పేరిట అదే అగ్రవర్ణాలవారి భార్యలను లేదా సోదరీమణులను చట్టసభలకు పంపి ఎప్పటిలాగే వారి ఆధిపత్యాన్ని పరిపుష్టం చేసుకుని దేశాన్ని ఏలుతుంటారు అనడంలో సందేహం లేదు. నిజంగా వీరికి చిత్తశుద్ధి గనుక ఉంటే మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాల్సిందే. ఎందుకంటే ఈ దేశ జనాభాలో సగానికి పైగా బీసీలున్నారు ఆ బీసీలలో సగానికంటే ఎక్కువ మహిళలే. దేశంలో సగభాగం బీసీ జనాభాకు దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లేని చట్టసభలు సమన్యాయాన్ని పాటించినట్లు ఎట్లయితవి. చట్టసభలలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదానికి అన్ని వర్గాలు సహకరించాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. కాగా ఈ బిల్లుల ఆమోదం కోసం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలతో ప్రభుత్వ వర్గాలు చర్చలు జరిపాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసేంతవరకు ఈ బిల్లుపై చర్చ వద్దని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకెళ్లడం గమనర్హం. దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాల్లో చీలిక తీసుకొచ్చి అయినా సరే ఈ బిల్లులను ఆమోదింప చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డీలిమిటేషన్ బిల్లులో భాగంగా 2021జనాభా లెక్కల ప్రకారంనియోజకవర్గాల సరిహద్దులను పునర్విభజించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తారు. ప్రతిపాదిత మార్పుల ప్రకారం సభ సీట్లు 543 నుంచి 816/850కు పెరుగుతాయి. దాంట్లో మూడోవంతు సీట్లు 273+ మహిళలకు రిజర్వు అవుతాయి. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ, సీట్లుకూడా పెరుగుతాయి. ఈ బిల్లులు 2029 మార్చి 31నుంచి అమలులోకి వస్తాయని, ఆ ఏడాది జరిగే లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల నుంచి సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వర్తిస్తుం దని అధికార వర్గాలు తెలిపాయి. మహిళా సంవాద్ పేరుతోబిజెపి కూడా పెద్దఎత్తున మహిళా సదస్సులు జరపాలని నిర్ణయించింది. ఇప్పటికైనా అన్ని రాజకీయపార్టీలు బీసీ మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు కావాలని పట్టుబట్టాలి. ●

# సాంకేతికతతోనే బంగారు భవిష్యత్తు!

డి. అశోక్

సాంకేతిక విప్లవాలు మానవ చరిత్రను పదేపదే కొత్త దిశల్లోకి నడిపించిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. ఆవిరి యంత్రం పరిశ్రమల యుగానికి శ్రీకారం చుట్టింది. విద్యుత్ ప్రపంచాన్ని వేగవంతం చేసింది. కంప్యూటర్లు ఇంటర్నెట్ సమాచారాన్ని ప్రజాస్వామ్యవంతం చేశాయి. ఇప్పుడు అదే స్థాయిలో, బహుశా అంతకంటే వేగంగా ప్రభావం చూపిస్తున్న శక్తి కృత్రిమ మేధస్సు(ఏఐ). ఈ నేపథ్యంలో పరీక్షలు ముగించి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు ఒక కీలకమైన ప్రశ్నను ఎదుర్కొంటున్నారు. ఏ కోర్సు చదివితే భవిష్యత్తు భద్రంగాఉంటుంది? గతంలో ఒకకాలంలో ఇంజినీరింగ్ అంటే ఉద్యోగం, తర్వాత కంప్యూటర్ సైన్స్ అంటే భవిష్యత్తు, ఆ తర్వాతఎంబీఏ అంటే ఎదుగుదల అనే అభిప్రాయాలు బలంగా ఉండేవి. కానీ నేటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో ఒకే కోర్సు జీవితాంతం భద్రతను కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఉద్యోగాల స్వభావమే మారుతోంది. ఈ మార్పుకు భయపడాల్సిన అవసరం లేదు. అర్థం చేసుకుని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఏఐ రాకతో ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోతాయనే భయం సమాజంలో విస్తృతంగా కనిపిస్తోంది. కానీ చరిత్ర చెబుతున్నది ఒకటే ప్రతి సాంకేతిక విప్లవం కొన్ని పాత ఉద్యోగాలను తగ్గించినా, అంతకంటే ఎక్కువ కొత్త అవకాశాలను సృష్టించింది. ఇదే పరిస్థితి ఇప్పుడు కూడా కనిపిస్తోంది. రొటీన్ పనులు తగ్గినా, విశ్లేషణ, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం అవసరమైన కొత్త రంగాలు విస్తృతంగా పెరుగుతున్నాయి. ఈ కొత్త ప్రపంచంలో డేటా కీలకమైన వనరుగా మారింది. డేటాను సేకరించి, శుభ్రపరచి, ఉపయోగపడేలా మార్చే డేటా ఇంజినీర్లు భవిష్యత్తులో అత్యంత అవసరమైన నిపుణులుగా నిలుస్తున్నారు. అదే డేటాలో దాగి ఉన్న నమూనాలను గుర్తించి భవిష్యత్తు అంచనాలు చేసే డేటా సైంటిస్టులు సంస్థల నిర్ణయాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ విశ్లేషణలను నిజ జీవితంలో పనిచేసే సిస్టమ్లుగా రూపొందించే మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్లు కూడా కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా, పెద్దస్థాయి సాంకేతిక వ్యవస్థలను ముందుచూపుతో రూపకల్పన చేసే ఏఐఆర్కిటెక్ట్‌లు, వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని టెక్నాలజీని ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చే ప్రొడక్ట్ మేనేజర్లు, సాంకేతిక బృందం, వ్యాపార బృందం మధ్య వారధిగా పనిచేసే ఏఐ ట్రాన్స్‌లేటర్లు వంటి కొత్త వృత్తులు వేగంగా ఎదుగుతున్నాయి. ఇవి కేవలం కంప్యూటర్ సైన్స్ చదివిన వారికి మాత్రమే కాకుండా భాషా శాస్త్రం, మేనేజ్‌మెంట్, సైకాలజీ వంటి రంగాల వారికి కూడా అవకాశాలను తెరుస్తున్నాయి. ఇటీవల జనరేటివ్ ఏఐ వ్యవస్థలు విస్తృతంగా వినియోగంలోకి రావడంతో ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి కొత్త నైపుణ్యాలు వెలుగులోకి వచ్చాయి. సరైన ప్రశ్న అడగడం కూడా ఒక శాస్త్రంగా మారింది. ఇదే సమయంలో ఏఐ తీసుకునే నిర్ణయాలు సమాజానికి హానికరం కాకుండా ఉండేలా పర్యవేక్షించే ఎథిక్స్ నిపుణులు, డేటా భద్రతను కాపాడే గవర్నెన్స్ స్పెషలిస్టులు కూడా అత్యంత అవసరమైన వృత్తులుగా మారుతున్నారు. ఈ పరిణామాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. భవిష్యత్తు కేవలం డిగ్రీలపై ఆధారపడదు, నైపుణ్యాలపై ఆధారపడుతుంది. సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, నిరంతర అభ్యాసం వంటి లక్షణాలు రేపటి విజయానికి అసలు పునాదులు. పాతకాలపు బట్టీ విధానం ఇప్పుడు సరిపోదు. విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపాలి, టెక్నాలజీ ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలి. ఇక్కడ తల్లిదండ్రుల పాత్ర కూడా అత్యంత కీలకం. పిల్లలను కేవలం మార్కుల కోసం పరుగులు పెట్టించే పోటీ యంత్రాలుగా కాకుండా, సమస్యలను పరిష్కరించే ఆలోచనాపరులుగా తీర్చిదిద్దాలి. సమాజానికి ఉపయోగపడే సృజనాత్మకతను ప్రోత్సహించాలి. ఎందుకంటే భవిష్యత్తులో నిలబడేది గుర్తుంచుకునే విద్య కాదు, ఆలోచించే విద్య. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఏఐ ఆధారిత నిర్ణయ వ్యవస్థల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఈ మార్పును ముందుగానే అర్థం చేసుకుని సిద్ధమయ్యే విద్యార్థులకే రేపటి ప్రపంచం చెందుతుంది. మార్పుకు భయపడేవారు వెనుకబడిపోతారు. మార్పును స్వీకరించేవారు ముందంజ వేస్తారు. అందుకే ఈ సాంకేతిక సంధికాలాన్ని ఒక ప్రమాదంగా కాకుండా ఒక అపూర్వ అవకాశంగా చూడాలి. నేటి విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా జ్ఞానం కోసం నేర్చుకుంటే, రేపటి ప్రపంచాన్ని నిర్మించే నాయకులుగా ఎదగగలరు. అదే నిజమైన సాంకేతిక స్వర్ణయుగానికి మార్గం. ●

# ప్రజావాక్కు



### రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి

ప్రకాశంజిల్లాలో చెవూరి దొంగస్వామి ఆక్రమించిన ప్రభుత్వ భూములను, తిరుపతి జిల్లాలో బియెన్‌కండ్రిక మండలంలో కల్కి అనే దొంగస్వామి ఆక్రమించిన అంజూర్ అటవీభూములనుస్వాధీనం చేసుకోవాలనికలెక్టర్లకు, సిసిఎల్ఎకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు, చివరికి ముఖ్యమంత్రికి ఎన్నో లేఖలు వ్రాయటం జరిగింది. తమాషా ఏమిటంటే మీ ఫిర్యాదు అందినది, ఇంకొకరికి పంపాము గ్రీవెన్స్‌లో చూసుకోండి అని మెసేజెస్ వస్తాయి. వ్రాతపూర్వకంగా వివరంగా ఫిర్యాదుచేస్తే, అదేవిధంగాసమాధానం రావాలి. గ్రీవెన్స్‌లో చూసుకోండి అనిచెప్పడం ఏమిటి? అలా చూసుకోవటం ఎవరికి తెలుస్తుంది? సమస్యల పరిష్కారం కొరకు ఫిర్యాదు చేసినప్పుడు, మీ ఫిర్యాదు అందినది, ఫలానా టైమ్‌లోపు సమస్య పరిష్కరిస్తాము అని లెటర్ వ్రాయాలి. అంతేకానీ గ్రీవెన్స్‌లోచూసుకోండి అని మెసేజ్ పెట్టడం ఫిర్యాదుదారున్ని నీరసపరచడమే అవుతుంది.

- నార్నే వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రేవులను రహదారులతో అనుసంధానించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులు, రేవుల అనుసంధానతను మెరుగుపరుస్తూ పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ఈ రవాణా ప్రణాళికలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వం సుమారు 1,040 కిలోమీటర్ల జాతీయ రహదారులను, 3,483 కిలోమీటర్ల ఇతర రహదారిపనులను యుద్ధప్రాతిపదికనపూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమేకాకుండా మారుమూలప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. సముద్ర తీర అభివృద్ధిలో భాగంగా మచిలీపట్నం రేవుకు ఆరువరుసలరహదారిని నిర్మిస్తున్నారు. రేవులను జాతీయ రహదారులతో అనుసంధానించడంతో వాణిజ్యంలో రాష్ట్రం వాటా పెరుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బడి పిల్లలకు అల్పాహారం

వచ్చే విద్యాసంవత్సరం 2026-2027జూన్ నుండి 1వ తరగతినుండి12వ తరగతి వరకు అల్పాహారం పెడుతున్నట్లు ప్రకటించడం సంతోషకారం. పేద విద్యార్థులకు ఎంతో మేలుకలుగుతుంది. అందుకోసంవేసవి సెలవులలో తగినఏర్పాట్లుచేయాలి. వంటపాత్రలు, ఏజెన్సీల ఏర్పాటు, టెండర్స్, పర్యవేక్షణ అధికారుల నియామకం, బడ్జెట్ కేటాయించి తగిన ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### అనారోగ్యానికి ఆహారమే మూలం

**ఆహారం** మన జీవన విధానానికి మూలాధారం. అయితే, ఇటీవల ప్రచురితమైన నివేదికల ప్రకారం అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు దేశంలో సుమారు 56 శాతం వ్యాధులకు కారణమవుతున్నాయని వెల్లడవడం ఆందోళన కలిగించే విషయం. ఈనేపథ్యంలో భారత వైద్యపరిశోధన మండలి-జాతీయ పోషకాహార సంస్థ(ఐసిఎం ఆర్ఎన్ఐఎన్) ప్రజలను ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లవైపు మళ్లించాలని పిలుపునిచ్చింది. ఇది కేవలం ఒక సూచనమాత్రమే కాదు, సమాజం మొత్తం ఆలోచించాల్సిన అత్యవసర అంశం. నేటి ఆధునిక జీవనశైలిలో వేగం పెరిగిన కొద్దీ ఆహారపు అలవాట్లలో కూడా విపరీత మార్పులు చోటుచేసుకున్నాయి. ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, అధికచక్కెర, ఉప్పు, కొవ్వుపదార్థాల వినియోగం పెరగడం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఈవ్యాధులు ఒకసారి వచ్చిన తర్వాత పూర్తిగా నయం చేయడం కష్ట సాధ్యం. కాబట్టి నివారణే ఉత్తమ మార్గం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### తీరు మారాలి

**తాము** తిని తినక కష్టపడి సంపాదించి పిల్లలని చదివించి వారికీ పెళ్లిళ్లుచేసి ఇంకా వారి భవిష్యత్తుమీద భయంతో తమ ఆస్తిపాస్తులన్నీ వారి పేరు మీద రాసి జీవిత చరమాంకంలో తమని ఆదరిస్తారనుకున్నతల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ ఆస్తి, డబ్బు తమకు దక్కగానేవారిని ఇంటి నుండిగెంటేస్తున్నారు. ఇంకొందరేమో అనాథాశ్రమాలలో చేర్పిస్తున్నారు. కొందరు తనయులు అన్ని తమ పేరు మీద రాయించుకొని ముసలి తల్లిదండ్రులను కనీస మానవత్వం మరిచి రోడ్డుపక్క నవదిలేస్తున్నారు. వారుఇప్పటికైనాకళ్ళుతెరిచి దైవసమానులైన తల్లిదండ్రులను వారి అవసానదశలో ఆదరించి కన్న వారి రుణం తీర్చుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రైల్వే టెర్మినాల్ వినియోగంలోకి తేవాలి

**ఉత్తర**, దక్షిణ ప్రాంతాలలోని పట్టణాలను కలుపుతూ ఫామ్ చేయబోయే రైల్వే కారిడార్‌లు దేశాభివృద్ధికి ఒక గ్రోత్ కనెక్టర్స్‌లాగ మారబోతున్నాయి అనడంలో సందేహం లేదు. ఈసారి బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నది కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. అందులో ముఖ్యంగా హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పూణే ప్రాజెక్ట్స్ తెలంగాణకు పచ్చలా హారంలాగా ఉంటాయి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# శాంతియుత పరిష్కారమే ఉత్తమమైన మార్గం

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇరాన్ సైనిక వ్యవస్థలతో పాటు అణు స్థావరాలను లక్ష్యంగా ఇజ్రాయిల్ అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులను ముమ్మరం చేస్తున్నాయి. దీనితో దేశాల మధ్య యుద్ధ వాతావరణం మరింత ఉద్రిక్తతలను కలుగచేస్తుంది. ప్రతి చర్యగా ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికాకు చెందిన ముఖ్యమైన స్థావరాలతోపాటు ఇజ్రాయిల్‌ను లక్ష్యంగా చేసుకొని సృష్టిస్తున్న యుద్ధ వాతావరణంతో దేశాల మధ్య ఘర్షణ మరింతగా పెరుగుతుంది. అయితే క్షేత్రస్థాయిలో సామాన్య జనాల కష్టాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎప్పుడు ఎటువైపు నుండి ఎలాంటి మారణాయుధాలు ముకుమ్మడిగా వచ్చి పడుతాయేమో అనే సందిగ్ధంలో యుద్ధాలు జరుగుతున్న ప్రాంతాల్లోని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాత్రిపగలు గడుపుతున్న పరిస్థితులు గోచరిస్తూనే ఉన్నాయి. యుద్ధంలో దేశాల్లోని వాణిజ్యపరమైన ముఖ్య సైనిక స్థావరాలను లక్ష్యంగాచేసుకొని సంధిస్తున్న అత్యాధునిక డ్రోన్లు, క్షిపణులు లాంటి మారణాయుధాలు తరచుగా జనావాసాల మీదికి వస్తూ అభంశుభం తెలియని ఎంతో మందిని బలి తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో దేశాల మధ్య ఉన్న విభేదాలు ఇరు దేశాల్లో ఉన్న సామాన్య జనాలకు శాపంగా మారుతున్నాయి. యుద్ధాలు ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ భౌగోళిక వనరులపై ప్రభావితం చూపిస్తూనే ఉన్నాయి. ఆర్థిక, ప్రాణ నష్టంతో పాటు ఆయుధాల విస్ఫోటనంతో వెలువడే విషపూరిత రసాయనాలు గాలిలో కలిసి వాతావరణం కాలుష్యం లాంటి అనేక నష్టాలను చవిచూసే అవకాశం లేకపోలేదు. నేటి ఆధునిక మానవుడు ఇంకా యుద్ధ తంత్రంలో మునిగి తేలుతున్న తరుణంలో దేశాల మధ్య ఏమైనా విభేదాలు సమస్యలున్నా పరస్పరం చర్చల ద్వారా దేశాల మధ్య ఉండే అపోహలను ఉద్రిక్తతలను నివారించే దిశగా శాంతియుత మార్గం ద్వారా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యుద్ధాల వలనచాలా వరకు ప్రయోజనం ఉండక పోవచ్చు కానీ యుద్ధాల వలన ప్రజలలో లేనిపోని అపోహలు గందరగోళాన్ని సృష్టించే అవకాశం లేకపోలేదు. అగ్రరాజ్యంలోని ప్రజలు అయినా ఆర్థికంగా వెనుకబడిన దేశాల ప్రజలు అయినా ఎక్కువ శాతం మాత్రం యుద్ధ కాంక్షను ఏ మాత్రం కావాలని కోరుకోరు. పైగా శాంతి కాముకులుగా జీవించాలని అనుకుంటారు.



దేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచుకొని భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు ఊహాత్మక భావనలకు యుద్ధమే పరిష్కారం అనుకుంటే నేటి ఆధునిక యుగంలో యుద్ధ కాంక్ష ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుకు మానవు కారణాలేవైనా అహింసా మార్గంలో సమస్యకు పరిష్కారం అన్వేషించి సరైన విధానంలో సమస్యను పరిష్కరించుకునే రీతి నేటి ఆధునిక మేధాశక్తికి అవసరం కావచ్చు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాల వలన దేశాల నడుమ వాణిజ్య వ్యాపార సంబంధాలు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా అవసరాలకు ఉపయోగపడే పెట్రోలియం ముడిసరుకు రవాణా చేసే నౌకలు యుద్ధంలో లక్ష్యం కావడం ఆయుధాలు సృష్టించే విధ్వంసం దాటికి వనరులు దెబ్బతినడం విలువైన కట్టడాలు కళ్ళముందే కుప్పకూలిపోతుండడం మనుషులు ప్రాణాలు కోల్పోతూ ఉండడం యుద్ధం చేస్తున్నది ఎవరికోసం దేనికోసం వచ్చే ఫలితం ఏముంది అని చర్చించుకునే లోపే జరగబోయే నష్టం తీవ్రంగా ఉంటుంది. దేశాల మధ్య సమస్యలు ఉంటే వాటినిశాశ్వతంగా సవరించుకునే ప్రయత్నం చేస్తేతప్ప మరొకటిలేదేమో. యుద్ధాలు ప్రపంచంలోని మానవాళిపై తీవ్రమైన ప్రభావం చూపెడుతూ ప్రపంచ ఆర్థిక స్థితిగతులనే మార్చివేసే విధంగా యుద్ధ వ్యూహాలు కొనసాగుతూ ఉండడం విస్మయానికి గురి చేస్తున్నాయి. అత్యంత శక్తివంతమైన ఆయుధాలు యుద్ధాల్లో విధ్వంసాలకు ఉపయోగిస్తున్న తీరు మానవ జీవన విధానాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలుగ చేస్తుండడం శోచనీయం. దేశాల మధ్య ఆధిపత్య యుద్ధాల వల్ల సామాజిక అభివృద్ధి ఆర్థికవ్యవస్థలు కోలుకోలేని నష్టాల నడుమ ముందుతరాల వరకు కూడా సరిచేసుకోలేని స్థితిలో దేశాలపరిస్థితి నలిగిపోతుండటం, హింసాత్మక ఆలోచనలతో ఉన్నటువంటి దేశాలు అంతగా సాధించేది ఏమీ లేకపోగా యుద్ధాల వలన ఆర్థిక సామాజిక అభివృద్ధికి వెనుకబడిపోతున్నాయి. కారణాలేవైనా పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత ఉధృతంగా మారుతూ ఆందోళన కలిగించేదిగా చేస్తుంది. యుద్ధం తీవ్రత పెరగడంతో ఇరాన్ కూడా వెనుకకు తగ్గేది లేదంటూనే వ్యూహప్రతి వ్యూహాలతో ముందుకు పోతుండటంతో దేశాల్లో తీవ్రమైన యుద్ధ వాతావరణం నెలకొంది. సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా అహింసా, సమైక్యవాదం దేశాల నడుమ సుస్థిరత ప్రపంచంలో యుద్ధ నియంత్రణతోపాటు సకల సమస్యలకు శాంతియుత పరిష్కారమే ఉత్తమమైన మార్గంగా అగ్రరాజ్యాలతోసహా యుద్ధ సన్నద్ధత కలిగినదేశాలు పరస్పరం శాంతి చర్చలతో ఉద్రిక్తతలను నిలువరించుకోవాలి. ●

# సంస్కరణలతో రైల్వేలో కొత్త ప్రమాణాలు

## పెరిగిన మౌలిక మార్పులు, తగ్గిన ప్రమాదాలు: ప్రధాని మోడీ ట్వీట్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: నిరంతర సంస్కరణలు, సాంకేతికత ద్వారా భారతీయ రైల్వేలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయని, కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. స్పష్టమైన విధానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశం, నిరంతర నిధుల కేటాయింపు ద్వారా గత దశాబ్ద కాలంలో భారతీయ రైల్వే భద్రతా వ్యవస్థ ఎలా రూపాంతరం చెందిందో వివరిస్తూ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక కథనంపై ప్రధాని మోడీ స్పందించారు. "భారతీయ రైల్వే వ్యవస్థలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి, దాని ఫలితాలు మన కళ్ల ముందే ఉన్నాయి. నిరంతర సంస్కరణలు, సాంకేతికత ద్వారా ఈ రంగం ఎలా కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ ప్రయాణికులలో చాలా మందికి రైలు ప్రయాణం అనేది ఒక ఎంపిక కాదు, అవసరం. ఇంత భారీ సంఖ్యలో ప్రయాణికులను సుదూర ప్రాంతాలకు చేరవేసే వ్యవస్థలో, భద్రత అనేది కేవలం సాంకేతిక కొలమానం కాదు. అది ప్రజల నమ్మకానికి సంబంధించిన విషయం" అని ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయంలో ఓ ప్రకటనలో పేర్కొంది.

ప్రధాని మోడీ తొలి ఐదేళ్లలో భారతీయ రైల్వే 'భద్రతే ప్రథమం' అనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని రాసుకొచ్చారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, సంస్థ తన భద్రతా వ్యవస్థను సాంకేతికత ఆధారితంగా, నిరంతర నిధులతో మార్పు దిశగా నడిపించింది. ఫలితంగా, దేశంలో రైలు ప్రమాదాల రేటు గణనీయంగా తగ్గింది. 2014-15లో భారతీయ రైల్వే 135 ప్రమాదాలను నమోదు చేయగా, 2025-26 నాటికి ఆ సంఖ్య 16కి తగ్గింది. ఇది 89 శాతం తగ్గుదల. రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ ప్రమాదాల సంఖ్యలో ఈ తగ్గుదల చోటుచేసుకుంది. ఈ కాలంలో, రైలు ప్రయాణించే ప్రతి యూనిట్ దూరానికి జరిగే ప్రమాదాలను కొలిచే పర్యవసాన ప్రమాద సూచిక (కాన్సీక్వెన్షియల్ యాక్సిడెంట్ ఇండెక్స్) 0.11 నుండి 0.01శాతానికి తగ్గింది. ఇది ప్రయాణించే ప్రతి కిలోమీటరుకు వ్యవస్థ చాలా సురక్షితంగా ఉందని సూచిస్తుంది. అలాగే 2014-15లో జరిగిన రైలు ప్రమాదాల్లో 292 మంది ప్రాణాలు కోల్పోగా, 2025-26లో జరిగిన 16 ప్రమాదాల్లో కేవలం 16 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. ప్రజల జీవితాల్లో భారతీయ రైల్వేలు పోషిస్తున్న ప్రాముఖ్యతను వివరించారు. "ప్రతి ఉదయం భారతదేశం నిద్రలేచే సమయానికి, దాని రైల్వేలు అప్పటికే గమనంలో ఉం టాయి. ఉద్యోగులు, విద్యార్థులు, వలస కార్మికుల నుండి కుటుంబాలు, సైనికుల వరకు ప్రతిరోజూ రెండు కోట్లకు పైగా ప్రయాణికులు దేశ రైళ్లలో ప్రయాణిస్తున్నారు" అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.



## లోక్‌సభలో 272 సీట్లు మహిళలకే..

### కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాట్లాడారు. 2023లో పాసైన మహిళా రిజర్వేషన్ విధానాన్ని జనాభా లెక్కలు, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అమలు చేయనున్నట్లు చెప్పారు. లోక్‌సభలో సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచనున్నట్లు చెప్పారు. 815 సీట్లకు ఆ సంఖ్య చేరుకోనున్నట్లు తెలిపారు. కోటాలో భాగంగా 272 సీట్లను మహిళలకు రిజర్వేషన్ కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. దీని వల్ల ఏ రాష్ట్రం కూడా తమ ప్రాతినిథ్యాన్ని కోల్పోదు అని, ప్రస్తుతం ఉన్న ఆయా రాష్ట్రాల సామర్థ్యం అలాగే కొనసాగుతుందని ఆయన అన్నారు. పురుషులకు కానీ, రాష్ట్రాలకు కానీ తాజా బిల్లులలో ఎటువంటి నష్టం ఉండబోదన్నారు. లోక్‌సభ సామర్థ్యం 815కి పెరిగినప్పుడు దాంట్లో 33 శాతం అంటే 272 అవుతుందని మంత్రి పేర్కొన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లుతో మహిళలకు సమానత్వం వస్తుందన్నారు. బిల్లులపై చర్చను ప్రారంభించిన మంత్రి తన ప్రసంగంలో అంబేద్కర్ ఆశయాలను ప్రస్తావించారు. మహిళలు ప్రగతి సాధించిన ఆధారంగానే ఆ సమాజ ప్రగతిని అంచనా వేస్తామన్న అంబేద్కర్ వ్యాఖ్యలను కూడా మంత్రి గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ అంశాన్ని సమర్థించిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వ్యాఖ్యలను కూడా మంత్రి గుర్తుచేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే రోజులు వస్తాయని, కానీ దానికి సమయం వచ్చిందని మంత్రి అన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలో తమ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగులు వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

# పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతి కొనసాగాలి



### ప్రధాని మోడీ, ఆస్ట్రియా చాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్ ఆకాంక్ష

### భారత్ - ఆస్ట్రియా మధ్య కుదిరిన 15 ఒప్పందాలు

### ఉగ్రవాద నిరోధకతపై జెఎస్‌జి ఏర్పాటుకు అంగీకారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆస్ట్రియా చాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆకాంక్షించారు. ఫెడరల్ ఛాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్ నాలుగు రోజుల అధికారిక పర్యటన కోసం న్యూఢిల్లీ వచ్చారు.

గురువారం ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అలాగే, పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో నెలకొన్న పరిస్థితులపై సమాలోచనలు జరిపారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుద ముట్టించడం కూడా అవసరమని అన్నారు.

ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు.

భారత్-ఇయు మధ్య కొత్త ఒప్పం దాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అంతకు ముందు ఇరుదేశాల నేతల ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో భాగంగా భారత్ -ఆస్ట్రియా గురువారం 15 తీర్మానాలపై సంతకాలు చేశాయి. రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలతో పాటు, ఇరు దేశాల మధ్య ఉగ్రవాద నిరోధకతపై ఒక సంయుక్త కార్యవర్గాన్ని (జెఎస్‌జి) ఏర్పాటు చేయడంపై ప్రధానంగా దృష్టి సారించాయి. నాలుగు దశాబ్దాలలో ఆస్ట్రియా ఛాన్సలర్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి.

## అనిల్ అంబానీకి సుప్రీంలో చుక్కెదురు: పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది.దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది.



## తల్లులు, సోదరీమణులకు ఇచ్చే గౌరవం దేశానికే గౌరవం

### మహిళా సాధికారత దిశగా చరిత్రాత్మక అడుగు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** తల్లులకు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపునకు సంబంధించి కేంద్రం పార్లమెంట్‌లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ నేడు ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా సాధికారత దిశగా నేడు దేశం చరిత్రాత్మక ముందడుగు వేయబోతోందని అన్నారు. భారత దేశ మహిళలపై గౌరవంతో ఈ దిశగా సాగుతున్నామని అన్నారు.మహిళల గొప్పదనాన్ని చాటిచెప్పే శ్లోకాన్ని కూడా ప్రధాని షేర్ చేశారు. అలాగే, మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలును నొక్కిచెబుతూ ప్రధాని మోడీ రాసిన వ్యాసాన్ని పంచుకున్నారు.శాసనసభలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను అమలు చేయడం, అలాగే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక ప్రక్రియలను ఆలస్యం లేకుండా పూర్తి చేయడం అత్యవసరమని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే రాసిన ఒక కథనాన్ని ప్రధాన మంత్రి రీట్వీట్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను ఒక సామూహిక జాతీయ ఘట్టంగా, ఒక సంస్థగా పార్లమెంటుకు ఒక మైలురాయిగా నిలుపుతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రయోజనాలు దేశవ్యాప్తంగా ఉన్న మహిళలకు వీలైనంత త్వరగా చేరేలా చూడటానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## నేడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక



### ఎన్‌డియే అభ్యర్థిగా హరివంశ్

### ఏకాభిప్రాయ సాధన కోసం జెపి నడ్డా విపక్షాలతో చర్చలు

### ఎన్నిక బహిష్కరించాలని ఇండియా కూటమి నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** రాజ్యసభ ఉపసభాపతి పదవికి ఏప్రిల్ 17 శుక్రవారం ఎన్నిక నిర్వహించనుంది. ఈ కీలక పదవికి హరివంశ్ నారాయణ సింగ్‌ను తిరిగి ఎన్నుకునేందుకు అధికార ఎన్‌డియే కూటమి గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ ఉపసభాపతి పదవి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హరివంశ్‌ను రాజ్యసభకు (ఎగువ సభకు) నామినేట్ చేయగా, ఆయన ఏప్రిల్ 10న ప్రమాణస్వీకారం చేశారు. కేంద్ర మంత్రి, రాజ్యసభలో సభా నాయకుడిగా వ్యవహరిస్తున్న జె.పి. నడ్డా, హరివంశ్‌ను ఉపసభాపతిగా తిరిగి ఎన్నుకోవడంపై వివిధ పార్టీల నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఆయన పేరుపై విస్తృత ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నంలో భాగంగా ఈ చర్చలు జరిగాయి. అయితే, లోక్‌సభ ఉపసభాపతి పదవి 2019 నుండి ఖాళీగా ఉన్నప్పటికీ, ఈ పదవిని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడంలో అధికార పక్షం చూపుతున్న "అత్యుత్సాహం" పట్ల కాంగ్రెస్, టిఎంసి, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికను బహిష్కరించాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఏడేళ్లుగా లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించని మోడీ ప్రభుత్వానికి నిరసనగా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికను ప్రతిపక్షం బహిష్కరిస్తుందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ గురువారం తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్రపతిచే రాజ్యసభకు నామినేట్ చేయబడిన వ్యక్తిని, ఆ సభ ఉపసభాపతి పదవికి పరిగణించడం ఇంతకు ముందెన్నడూ జరగలేదని ఆయన అన్నారు.

## 'జన నాయగన్' సినిమా పైరసీ కేసు


## ప్రధాన నిందితుడు అసిస్టెంట్ ఎడిటర్

**చెన్నై, ఏప్రిల్ 16:** తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా ఇంటర్నెట్‌లో లీక్ అయిన కేసులో కీలక పురోగతి లభించింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తమిళనాడు సైబర్ క్రైమ్ వింగ్ పోలీసులు గురువారం వెల్లడించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుడు మరో సినిమాకు ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, ఎడిటింగ్ స్టూడియోలో ఉన్న 'జన నాయగన్' సినిమా రీల్స్‌కు అనధికారికంగా యాక్సెస్ సంపాదించి, డేటాను దొంగిలించాడు. ఆ తర్వాత ఆ డేటాను పూర్తి సినిమాగా మార్చి, సహ నిందితులతో పంచుకున్నాడు. వారి ద్వారా ఈ పైరసీ కాపీ ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అయింది. డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక విశ్లేషణ జరిపిన తర్వాత ఈ ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ విభాగం పేర్కొంది.

# మంటల్లో పశ్చిమాసియా

## మా తొలి క్షిపణి దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్..

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, ఏప్రిల్ 16:** చమురు రవాణాకు ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మోహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారని, ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా? అని రెజాయ్ ప్రశ్నించారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. తమ క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి అమెరికా నౌకలను ధ్వంసం చేయగలవని పేర్కొన్నారు. మా దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాలు ప్రాణాలుకూడా పోవచ్చని రెజాయ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వచ్చిన వార్తలపై కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యుఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.



## లాహోర్‌లో కాల్పులు: అమీర్ హామ్జా మృతి

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 16:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా సహ వ్యవస్థాపకుడు అమీర్ హామ్జాపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. లాహోర్ నగరంలో జరిగిన ఈ దాడిలో హామ్జా తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తాజాగా, గురువారం దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందినట్లు సమాచారం. లష్కరే తోయిబా అధినేత హాఫిజ్ సయీద్ తర్వాత ఆ సంస్థలో అత్యంత కీలకమైన వ్యక్తి అమీర్ హామ్జా. సంస్థ ఆవిర్భావం నుంచి హాఫిజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడిగా, సలహాదారుడిగా ఆయన వ్యవహరించారు. సరిహద్దుల గుండా ఉగ్రవాదులను చొరబెట్టడం, నిధుల సేకరణ వంటి కార్యక్రమాల్లో హామ్జా కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అమీర్ హామ్జాను అమెరికా ట్రెజరీ విభాగం అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. భారత్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి ఇప్పటికే ఇతనిపై నిషేధం విధించాయి.

# ఓటర్లకు 'విజయ్' వరాలు

### గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4వేలు

### టివికె మేనిఫెస్టో ఆవిష్కరించిన దళపతి విజయ్



**చెన్నై, ఏప్రిల్ 16:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా టివికె చీఫ్ విజయ్ ఓటర్లకు వరాలు కురిపించారు. భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు. ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ. 4,000, యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, డ్రగ్స్-ఫ్రీ తమిళనాడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా 2036నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ.15 వేల కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.


## ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఢీకొన్న రెండు విమానాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ వర్గాల సమాచారం ప్రకారం, స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ 737 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆసమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం క్యూపీ 1406 నిలిపి ఉంది.

వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క (రైట్ వింగ్), నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దీంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించాం. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఘటన కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. అయితే, దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

## ఇరాన్ నిఘా వలలోకి అమెరికా స్థావరాలు



**టెహ్రాన్, ఏప్రిల్ 16:** అమెరికాతో జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్‌కు చైనా సహాయం చేస్తుందనే వాదనకు బలం చేకూరేలా మరో నివేదిక వెల్లడయ్యింది. పశ్చిమాసియా యుద్ధం సమయంలో గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా సైనిక స్థావరాల గురించి సమాచారం కోసం గతేడాది రహస్యంగా పొందిన చైనా నిర్మిత ఉపగ్రహంపై ఇరాన్ ఆధారపడిందని ఫైనాన్షియల్ టైమ్స్ నివేదించింది. టిఇఇ-01బిగా పిలిచే ఈ ఉపగ్రహాన్ని చైనా సంస్థ ఎర్త్ ఐ కంపెనీ అభివృద్ధి చేసి ప్రయోగించగా.. ఆ తర్వాత దానిని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఏరోస్పేస్ ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. ఇరాన్‌కు చైనా సైనిక సాయం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపన ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే.

'ఇన్-ఆర్బిట్ డెలివరీ' పద్ధతిలో ఎర్త్ ఐ విదేశాలకు ఉపగ్రహాలను సరఫరా చేస్తుంది. చైనాలో ప్రయోగించిన ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన తర్వాత మాత్రమే విదేశీ కొనుగోలుదారులకు బదలీ చేస్తుంది. నివేదిక ప్రకారం.. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై నిఘా ఉంచే బాధ్యతను ఇరాన్ కమాండర్లు దీనికి అప్పగించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆసియా, లాటిన్ అమెరికా, ఇతర ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చైనా ఆధారిత ఉపగ్రహ సేవల సంస్థ ఎంపోసాట్ నడుపుతున్న వాణిజ్య గ్రౌండ్ స్టేషన్ నెట్‌వర్క్‌కు కూడా ఐఆర్‌జిసికి ప్రాపత్య కల్పించింది.

ఈ ఎస్-టైపు ఉపగ్రహం మార్చి 13, 14, 15తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం ఫొటోలను తీసినట్లు సమాచారం. ఆ తర్వాతే అంటే మార్చి 14న ఆ వైమానిక స్థావరంలోని అమెరికా యుద్ధ విమానాలు దాడుల్లో ధ్వంసమైనట్లు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఇది కేవలం సౌదీనే కాకుండా.. జోర్డాన్‌లోని మువాఫకన సల్తీ, బహ్రెయిన్‌లోని మనమాలో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్ ఎర్బిల్ ఎయిర్‌పోర్టు వంటి చోట్ల కార్యకలాపాలను కూడా టిఇఇ-018 పర్యవేక్షించింది. ఇదే సమయంలో వాటిపై ఇరాన్ దాడులు చేసినట్లు ప్రకటించడం గమనార్హం.

## తెలంగాణ ఏర్పాటుపై బిజెపి ఎంపి వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బిజెపి తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండిం చారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానిం చడమేనని మండిపడ్డారు. బిజెపి నేతలకు తెలంగాణ ఉనికి అన్నా, ఇక్కడి ప్రజల అభ్యున్నతి అన్నా మొదటి నుంచి కడుపుమంట అని ధ్వజమెత్తారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది వందలాది మంది యువకుల బలిదానాలు, దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితం. రాజ్యాంగ బద్ధంగా పార్లమెంటు ఆమోదించిన ప్రక్రియను దేశ విభజనతో పోల్చడం ఎంపి అజ్ఞానానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. గతంలో ప్రధాని మోదీ కూడా తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని మాట్లాడారని వాపోయారు ఆ విద్వేష భావజాలమే ఇప్పుడు ఎంపి తేజస్వీసూర్య మాటల్లో ప్రతి బింబిస్తోందని మంత్రి దుయ్యబట్టారు. రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకోకుండా, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని మంత్రి గుర్తు చేశారు. ఒక తల్లి మనసుతో తెలంగాణ బిడ్డల ఆవేదనను అర్థం చేసుకున్న వ్యక్తి సోనియా గాంధీ అనీ, బిజెపి నేతలు మాత్రం నిత్యం విషం చిమ్ముతూనే ఉన్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓట్ల కోసం ఇక్కడి ప్రజలను వాడుకుంటూ, మనసులో మాత్రం తెలంగాణ పట్ల విద్వేషాన్ని నింపుకున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.చిన్న రాష్ట్రమైన తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకనే బిజెపి నేతలు ఇలాంటి వివాదాలకు తెరలేపుతోందని జూపల్లి ఆరోపించారు. తక్షణమే ఎంపి తేజస్వీ సూర్య తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మంత్రి హెచ్చరించారు.

## హైబ్రిడ్ విధానం రాజ్యాంగ వ్యతిరేకం కాదు

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** దేశంలో నియోజకవర్గ పునర్విభజనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ విధానం అంబెద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకమంటూ బిజెపి తప్పించుకొనే ప్రయత్నం చేయడం బాధకరమనీ దేశంలో దక్షిణాధి రాష్ట్రాల అస్థిత్వంకు విఘాతం కలిగించే బిజెపి ఆలోచన ఖండించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుపై బిజెపి తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ విభజన ఇండియా,పాకిస్తాన్ విభజనలా జరిగిందని లోక్ సభలో బిజెపి ఎంపి అనడం ఆనాటి ప్రతిపక్షనేత సుష్మస్వరాజ్‌ను కూడా అవమాన పరచడమే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును పెండింగ్ లో ఎవరు పెట్టారు, ఎందుకు పెట్టారో తేజస్వి సూర్యకు అవగాహన ఉందా...? అని ఆయన ప్రశ్నించారు. 2023లో మాహిళా రిజర్వేషన్ల బిల్లు పాస్ అయితే 2027 జానాభా లెక్కల ఆధారంగా అమలు చేస్తామని బిజెపి చెప్పలేదా...? అని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ ను హేళన చేసే విధంగా తేజస్వి సూర్య మాట్లాడటం తగదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నాడు ఉమ్మడి ఎపిలో అన్ని రాజకీయ పార్టీలు ఒప్పుకున్నాయనీ అన్నారు. 1600 మంది తెలంగాణ అమరవీరులను అవహేళన చేసేవిధంగా బిజెపి ఎంపి తేజస్వి సూర్య మాట్లాడారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని అవమానపరిస్తే సహించం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్16,ప్రభాతవార్త:**పార్లమెంట్ వేదికగా బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు."తెలంగాణ రాష్ట్రం వందలాది మంది విద్యార్థులు, యువకుల ప్రాణత్యాగాల ఫలితం. దశాబ్దాల పోరాటం, ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టం ద్వారా ఏర్పడిన రాష్ట్రాన్ని, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ఠ. ఇది అమరుల త్యాగాలను కించపరచడమే." అని మంత్రి మండిపడ్డారు."భారత రాజ్యాంగం ప్రకారం జరిగిన రాష్ట్ర విభజనకు తేడా తెలియని వారు పార్లమెంట్‌లో ఉండటం దురదృష్టకరం. కోట్లాది మంది ప్రజలను అవమాన పరిచేలా మాట్లాడిన తేజస్వి సూర్యపై లోక్ సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం దేశ సమగ్రతను, ప్రాంతీయ సామరస్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం భావ్యం కాదునీ అన్నారు. " "తెలంగాణ సమాజాన్ని కించపరిచిన తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలి"తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిజెపి ఇలాంటి విషపూరిత వ్యాఖ్యలు చేస్తోందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని మంత్రి హెచ్చరించారు.

## ఎంబిబిఎస్ ఫైనలియర్ జనరల్ సర్జరీ పేపర్-1 పరీక్ష రద్దు.. 27న తిరిగి నిర్వహణ

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఈ నెల 15న జరిగిన ఎంబిబిఎస్ ఫైనలియర్ జనరల్ సర్జరీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 27న తిరిగి నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎంబిబిఎస్ పరీక్షల సిలబస్‌లో ఎన్ఎంసి నియమ నిబంధనల ప్రకారం పాత నిబంధనలకు, కొత్త నిబంధనలకు మధ్య వ్యత్యాసం ఉండటమేనని తెలిపారు. .పాత నిబంధనలలోని పేపర్-1 జనరల్ సర్జరీ కింద చేర్చబడిన కొన్ని అధ్యాయాలు ఇప్పుడు కొత్త నిబంధనలలోని జనరల్ సర్జరీ పేపర్-2 లో చేర్చబడ్డాయని, దీని కారణంగా ఈ నెల 15న జరిగిన జనరల్ సర్జరీ పేపర్-1 (పాత నిబంధనలు) పరీక్షలో, జనరల్ సర్జరీ పేపర్-2 (కొత్త నిబంధనలు) సిలబస్‌లో ఉండాల్సి న కొన్ని ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. ఇదే విషయమై విద్యార్థుల నుండి అందిన అసంఖ్యాకమైన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని, పరీక్షను నిష్పక్షపాతంగా నిర్వహించడం కోసమే ఈ నెల 15న జరిగిన పరీక్షను రద్దు చేసి, తిరిగి ఈ నెల 27న నిర్వహించాలని నిర్ణయించినట్టు రిజిస్ట్రార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎక్సైజ్ డిసి సోమిరెడ్డి రాజీనామాను ప్రభుత్వం తిరస్కరించాలి

### ఎక్సైజ్ రిటైర్డు ఉద్యోగుల సంఘం తీర్మానం

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమి షనర్ రాజీనామాను ప్రభుత్వం తిరస్కరించి ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ప్రొహిబిషన్,ఎక్సైజ్ డిపార్టుమెంట్ ఎంప్లాయీస్, సీనియర్‌సిటిజన్ అసోసియేషన్ ఒక ప్రకటనలోన డిమాండ్ చేసింది. ఎక్సైజ్ రిటైర్డు ఉద్యోగుల సంఘం గురువారం సమావేశమై ఎక్సైజ్ కమిషన్ హరికిషన్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల పట్ల అమానవీయంగా వ్యవహరించే హరికిషన్‌ను ఇప్పటికైనా తన బుద్ధి మార్చుకొని ఇతరుల ఆత్మ గౌరవం కించబరచకుండా వ్యవహరించాలని వారు హితవు చెప్పారు. అనేక మంది అధికారులను ఆయన వేధించడాని దూషించాడని ఆయనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షులు ముకందరెడ్డి ఉపాధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, జనార్ధన్‌రావు, జనరల్ సెక్రటరీ విజయశంకర్‌లు సోమిరెడ్డి రాజీనామా వెనక్కి తీసుకోవాలని కోరారు. హరికిషన్‌పై ఎలాంటి చర్య తీసుకోకుండా ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే తాము జెఎసితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇదిఇలా ఉంటే కానిస్టేబుల్ బదిలీల సందర్భంగా కమీషనర్ తనతో అనుచితంగా ప్రవర్తించిన అంశంపై ప్రతిఒక్కరు నాకు బాసటగా నిలిచారని వారికి నా ధన్యావాదాలనీ నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి తెలిపారు.

## తేజస్విసూర్యను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలి




గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### తెలంగాణ ఆత్మగౌరవం, అమరులను కించపరిచిన బిజెపి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పాటును దేశవిభజనతో పాకిస్థాన్ ఏర్పాటుతో పోల్చుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి తేజస్వీసూర్యను వెంటనే పార్లమెంట్ సభ్యత్వం నుంచి తొలగించి బర్తరఫ్ చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురు వారం మీడియాతో మాట్లాడుతూ తేజస్వీసూర్య తన మాటలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశా రు. తెలంగాణపై అవహే ళనతో మాట్లాడిన సభ్యు డిపై స్పీకర్ ఓంబిర్లాకు లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తామని ఆయన తెలి పారు. తేజస్వి మాటలు పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పా టుపై లోక్‌సభ, రాజ్య సభలో పాస్ చేసిన బిల్లు లు అవమాన పరుస్తుంటే తెలంగాణ నుండి ఎంపి కైన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు చీమూనెత్తురు లేకుండా వాటిని విని ఆనందించే దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎంపి తేజస్వి మాట్లాడిన మాటలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరులకు అవమానపరచడమే కాదు ఉద్యమస్ఫూర్తికి విఘాతం కలిగించేలా మాట్లాడారని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ త్యాగాలు చేసి ప్రజాస్వామికంగా చట్టాల ద్వారా తెచ్చుకున్నామని ఆయన గుర్తుచేశారు. బిజెపి నేతలు ఇష్టారీతిన మాట్లాడితే తెలంగాణ బిజెపి నేతలు ఎవరు ఎందుకు స్పందించడం లేదన్నారు. తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు ఇప్పటికైనా తెలంగాణతల్లికి జరిగిన అవమానంపై గొంతు విప్పాలని కోరారు.

తెలంగాణ ఏర్పాటు పై ఇంత అక్కసు వివక్ష మంచిది కాదన్నారు. నియోజకవర్గాల పునర్వి భజనపై మాట్లాడాల్సిన తేజస్వీసూర్య తెలం గాణపై అక్కసుతో మాట్లాడటం తగదని తెలంగాణకోసం కొట్లాడిన ప్రతి వ్యక్తి గళం విప్పాలని ఆయన కోరారు.

## దళారులకు చెక్ పెట్టేందుకు వ్యవసాయ మార్కెటింగ్‌లో సంస్కరణలు

### త్వరలో ప్రభుత్వానికి నివేదిక

### రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకు వచ్చేలా సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలోనే సమర్పించనున్నట్లు రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి వెల్లడించారు. రైతులకు లాభదాయకమైన, పారదర్శకమైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో జరుగుతున్న లోపాలను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టింది. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సహా పలు మార్కెట్లను ఇప్పటికే సందర్శించింది. ఈ సందర్భనలో కూరగాయలు, పండ్లు, పూల మార్కెట్లలో రైతులకు అన్యాయం జరుగుతున్నట్లు కమిషన్ గుర్తించింది. వ్యవసాయ మార్కెట్లలో మధ్య దళారీ వ్యవస్థ విస్తృతంగా పెరిగి ఉండటం వల్ల రైతులకు న్యాయమైన ధరలు అందకపోవడం ప్రధాన సమస్యగా మారిందని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రైతులను మధ్యవర్తుల ప్రభావం నుండి కాపాడి వారికి తగిన లాభదాయక ధరలు అందేలాచర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని కమిషన్ స్పష్టం చేసింది. ఈ అంశంపై గురువారం కమిషన్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులు, రైతు సంఘాలు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, కార్యదర్శులు, కమిషన్ ఏజెంట్లు, ప్రకృతి వ్యవసాయ రైతులు, ఐటిడిఏ అధికారులు, రైతులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధుల నుండి కమిషన్ విలువైన సూచనలు, సలహాలు స్వీకరించింది. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాములునాయక్, భూమి సునీల్, భవానీరెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కె.వి.ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత

### ముగ్గురు అరెస్టు, పరారీలో సూత్రధారి



నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత కేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి భాస్కర్

**తాండూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. తాండూర్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు డిసిపి వెల్లడించారు. బెల్లంపల్లి నుండి తాండూర్ కు నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్నారని పక్కా సమాచారం మేరకు తాండూర్ ఎస్సై ప్రసాద్, మండల వ్యవసాయ అధికారిణి కొండలే సుష్మ పోలీసు సిబ్బంది బుధవారం సాయంత్రం బోయపల్లి బోర్డ్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు నిర్వహించారు.

బెల్లంపల్లి వైపు నుంచి వస్తున్న ఒక ఆటోను తనిఖీ చేయగా 150 కేజీల నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. భీమిని మండలం నారాయణపూర్ ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బోయపల్లి బోర్డు వద్ద నివాసం ఉంటున్న పూస సుబ్బారావ్, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్ కు చెందిన ఆటో డ్రైవరు మగ్గూంలను పోలీసులు అదుపులోకి తీసుకుని, నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాకు చెందిన గుంటుపల్లి శ్రీనివాస్ వద్ద నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసినట్లు డిసిపి తెలిపారు. సూత్రధారి శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు డిసిపి తెలిపారు.

## ఎంపి తేజస్వి వ్యాఖ్యలను భూతద్దంలో చూడొద్దు

### బిజెపి మద్దతు లేకుండా తెలంగాణ వచ్చేదా?

### నాటి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే పెద్దఎత్తున యువత బలిదానం: బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపె ఎంపి తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కావాలనే వక్రీకరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. తేజస్వి వ్యాఖ్య లను భూతద్దంలో చూపిస్తూ రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. తేజస్వి సూర్య వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థం వేరని, దానిని తప్పుగా అర్థం చేసుకుని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ.. 'తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదు. ఆయన ఉద్దేశం తెలంగాణను కించపరచడం కాదు. అని స్పష్టం చేశారు. విభజన సమయంలో జరిగిన అశాస్త్రీయ ధోరణిని లేదా రాజకీయ పరిణామాలను ప్రస్తావించి ఉండవచ్చని, అయితే బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఆ వ్యాఖ్యలను తమకు అను కూలంగా మలుచుకుంటున్నారని విమర్శించారు. దేశ విభజన సమయంలో ప్రాణనష్టం చోటుచేసుకున్న విధంగానే కాంగ్రెస్ పార్టీ వైఫల్యం కారణంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగానూ చోటుచేసుకుందన్న దోరణిలో ఎంపి తేజస్వి మాట్లాడారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో బిజెపి పాత్రను ఎవరూ విస్మరించలేరని ఆయన గుర్తుచేశారు. "బిజెపి మద్దతు లేకుంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా?. పార్లమెంట్‌లో నాడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి సంపూర్ణ మద్దతు ఇచ్చినందునే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది. అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం క్రెడిట్ మొత్తం తమదేనని చెప్పుకునే బిఆర్ఎస్‌కు (నాడు టీఆర్ఎస్) పార్లమెంట్‌లో ఉన్న బలం ఎంత అని ఆయన ప్రశ్నించారు. 'లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బిఆర్ఎస్‌కు కనీసం ఇద్దరు సభ్యులు కూడా లేరు. మరి రాష్ట్రం ఎలా వచ్చిందో ఆ పార్టీ నేతలు ఆలోచించుకోవాలి అని హితవు చెప్పారు. ఇప్పటికైనా ఎంపి తేజస్వి వ్యాఖ్యలను వక్రీకరించడం మానుకోవాలని బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు.

## పెద్దపల్లి ఎంపి జి.వంశీకృష్ణ విమర్శ

## డీలిమిటేషన్‌తో దక్షిణభారత రాజకీయ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా బిజెపి కుట్ర

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణ భారత దేశ రాజకీయ అస్థిత్వం దెబ్బతీసేందుకు బిజెపి కుట్ర పన్ను తోందని పెద్దపల్లి ఎంపి జి.వంశీకృష్ణ ఆరోపించారు. గురువారం పార్ల మెంట్ ఆవరణలో విలేఖరులతో మాట్లాడుతూ డీలిమిటేషన్ బిజెపి జుమ్లా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణ భారత దేశంలో ఓట్లు పడవని దక్షిణభారతదేశంను నిర్లక్ష్యం చేస్తున్నారని అయితే ఇక్కడి నిధులు మాత్రం అక్కడికి తరలిం చడం ఎందుకని ప్రశ్నించారు. దక్షిణ భారత దేశం నిధులు దక్షిణ రాష్ట్రాలు మాత్రమే వినియోగిం చుకొంటాయని ఆయన తెలిపారు. ఉభయ సభల్లో దక్షిణ భారత జనాభాకు అనుగుణంగా 3శాతం మాత్రమే చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తు న్నారని ఇక్కడ నుంచి ఉత్తరాధికి 5నుంచి 6శాతం నిధులు తరలిపోతున్నాయని అన్నారు. భారతదేశంలో దక్షిణభారతం ఒక భాగమే కాదనే రీతిలో ఉత్తరాధి పాలకులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన చెందారు.

బిఆర్ అంబెద్కర్ స్ఫూర్తితో భారత రాజ్యాధికారంలో సమానమైన వాటా దక్షిణభారత దేశం నుంచి ప్రాతినిధ్యం వహించేదుకు పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం స్ఫూర్తిగా వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపి కేంద్రం మెడలు వంచుతామని తెలిపారు.మహిళా బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర మండిపడ్డారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదని, పార్లమెంట్‌లో 3.13 శాతంగా ఉన్న తెలంగాణ ప్రాతినిధ్యం డీలిమిటేషన్ తర్వాత కూడా అంతే ఉండాలని సూచించారు. లేదంటే మరో తెలంగాణ ఉద్యమం తప్పదని హెచ్చరిం చారు. మహిళా బిల్లులో బిసిసబ్ కోటా ఉండాల్సిందేనన్నారు.

## మూడు లక్షలు దాటిన ఎప్‌సెట్ దరఖాస్తులు

### అపరాధ రుసుం రూ.2,500తో 20వరకు గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించి గురువారం సాయంత్రం వరకు 3 లక్షలకిపైగా దరఖాస్తులు వచ్చాయి. అపరాధ రుసుం రూ. 500తో ఈ నెల 15తో గడువు ముగిసిన నేపథ్యంలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎప్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు 3,00,462 దరకాస్తులు వచ్చినట్టు తెలిపారు. అందులో ఇంజనీరింగ్‌కి 2,09,868 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 90,279 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 315 దరఖాస్తులు వచ్చాయి. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేయగా.. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు.

పరీక్ష ఫీజును ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 500గా నిర్ణయించగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. రెండు పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 1000 కాగా, ఇతరులకు రూ. 1800గా నిర్ణయించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 4 వరకు దరఖాస్తులను స్వీకరించగా. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ. 500తో ఏప్రిల్ 15 వరకు స్వీకరించారు. రూ. 2500తో ఏప్రిల్ 20 వరకు, రూ. 5000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు స్వీకరించనుండగా.. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదీల్లో నిర్వహించనుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నారు.

## నేడు భోజన విరామంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన

### నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపనున్న ప్రభుత్వోద్యోగులు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కారించాలన డిమాండ్ చేస్తూ నేడు(శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు నిరసన తెలపనున్నారు. రాష్ట్రంలోని అని ప్రభుత్వ ఆఫీసుల్లోనూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలపాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నిర్ణయించిన నేపథ్యంలో ఉద్యోగులు నేడు నిరసన చేపట్టనున్నట్టు జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నేడు మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగే నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని, హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. ప్రధానంగా తెలంగాణ 2వ పిఆర్‌సిని శివశంకర్ కమిటీ నుండి తెప్పించుకొని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగుల ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలని, రూ. 13వేల కోట్ల పైచిలుకు ఉన్న ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంలో ఒకేసారి విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ తరపున ప్రభుత్వం ముందుంచిన 63 డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హామీలు అమలయ్యేదెప్పుడు? ఉద్యోగుల కష్టాలు తీరేదెప్పుడు అని ప్రశ్నించారు.

## సామాన్యులకు కూరగాయల షాక్

### రూ.10 నుండి 15 వరకు పెరిగిన ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరోసారి కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇటీవల అకాల వర్షాల క్రమంలో పంటకు నష్టం జరిగింది. దీని వల్ల సరఫరా తగ్గిపోవడంతో వేసవి కాలం క్రమంలో ధరలు ఆమాంతం పెరుగుతున్నాయి. కొన్నిచోట్ల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను పెంచేస్తున్నారు. దీంతో ఇప్పుడు కూరగాయల ధరలు రెండింతలు పెరిగాయి. కిలోకు రూ.10 నుండి రూ.15 వరకూ పెంచారు. ఇటీవల వరకు కిలో టమాటా రూ.10కి లభించగా, ఇప్పుడు రూ.20కిపైగా పలుకు తున్నాయి. రైతు బజార్లలో ఒక మాదరి ధరలు ఉంటే బయట మార్కెట్లో మరింత పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కూకట్ పల్లి రైతు బజార్‌లో కేజీ టమాటా రూ.23, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, బీన్స్ రూ.60, క్యారెట్ రూ.23, గోబిపువ్వు రూ.25, దొండకాయ రూ.23, చిక్కుడుకాయ రూ.50కు పెరిగాయి. ఇక కేజీ బీట్ రూట్ రూ.23, క్యాప్సికం రూ.33, కంద రూ.30, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.18, చామగడ్డ రూ.28, చిలకడదుంప రూ.25, పచ్చిబఠాణి రూ.40, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.45, ఎండుమిర్చి రూ.260 పలుకుతున్నాయి. ఇక కిలో అల్లం రూ.100, వెల్లుల్లి రూ.200, చింతపండు రూ.160, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.80, పల్లికాయ రూ.50కి చేరుకున్నాయి.

## విద్యుత్ సరఫరా సంఘ పిటిషన్‌పై విచారణ 20కి వాయిదా

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఏకైక సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) సిరిసిల్లా పాలకవర్గం దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణను హైకోర్టు ధర్మాసనం విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. విద్యుత్ సరఫరా సంఘం 56 ఏండ్లుగా సేవలందిస్తోందని పాలకవర్గమైన తమకు ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ నియంత్రణ కమిషన్ తమ ఆధీనంలోకి తీసుకున్నాయని ఈ నెల 7న హైకోర్టును ఆశ్రయించింది.

ఈ నేపథ్యంలో కేసు విచారణ సందర్భంగా జస్టిస్ రేణుక ఎదుట విద్యుత్ సరఫరా సంఘం పాలకవర్గం తరపున మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు, అడ్వకేట్ వాదనలు వినిపించారు. తమ సంస్థకు సంబంధించి రెవెన్యూవల్ నిమిత్తం 2025లో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకూ లైసెన్స్ రెన్యువల్ చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసు కొచ్చారు. విద్యుత్ నియంత్రణ కమిషన్, ఉత్తర తెలంగాణ పంపిణీ సంస్థ తోపాటు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయడంతో జస్టిస్ రేణుక నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును ఈ నెల 20కు వాయిదా వేశారు. దీంతో ఈ సంఘం భవిష్యత్‌పై మరింత ఉత్కంఠ నెలకొన్నది.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** న్యూఢిల్లీలో గురువారం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు సిఎం రేవంత్‌రెడ్డిని నిర్మల్ జిల్లా మాజీ జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు కలిశారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు

## జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించాలి

### మాదిగ మహాశక్తి వ్యవస్థాపకుడు మోత్కుపల్లి

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో మాదిగల రాజకీయ భాగస్వామ్యం కోసం, ఆత్మగౌరవ రక్షణ కోసం మాదిగ మహాశక్తి ఐక్యమై పోరాడాలని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నరసిం హులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా మాదిగలు రాజకీయంగా నిరాధారణకు గురవుతున్నారని అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని, అగ్రకుల రాజకీయ శక్తులు మాదిగలను అసెంబ్లీ, పార్లమెంటు మెట్లు ఎక్కకుండా కుట్రలు పన్నుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక శాతం జనాభా లేని వారు కూడా ముఖ్యమంత్రులు అవుతుంటే, 70 లక్షల జనాభా ఉన్న మాదిగలకు 19 ఎమ్మెల్యే సీట్లకు గానూ నామమాత్రపు సీట్లు ఇవ్వడం అవమానకరమని అన్నారు. మహిళలపై దాడులు, ఉద్యోగులపై అక్రమ ఏసీబీ కేసులు, ప్రమోషన్లలో అడ్డంకులు సృష్టిస్తూ మాదిగ జాతిని ఎదగకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని లేనిపక్షంలో రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో మాదిగ భవనాన్ని నిర్మించాలని కోరారు. న్యాయవ్యవస్థలో పిపి, సిపి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎంపిగా వేం నరేందర్ ప్రమాణస్వీకారం



**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** రాజ్యసభ ఎంపి గా కాంగ్రెస్ నాయ కుడు వేం నరేందర్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ ప్రజల సమస్యలు, రాష్ట్రహక్కులు, రాష్ట్రానికి రావల్సిన నిధుల సాధనకు చట్టసభల్లో నా గొంతు విప్పుతానని అన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం శాయశక్తుల కృషిచేస్తానని తనకు రాజ్య సభ సభ్యత్వం ఇప్పిం చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనపై నమ్మకంతో ఎంపి పదవి ఇచ్చిన అధిష్ఠానానికి ధన్యావాదాలు తెలిపారు.

## అంగన్‌వాడీలకు అదనపు నిధులు

### కేంద్రానికి అధికారుల ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తెలంగాణలో అంగన్వాడీ సెంటర్లకు అదనపు నిధులు మంజూరుకు కేంద్రాన్ని కోరుతూ మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తద్వారా రాష్ట్రంలోని పిల్లలకు పౌష్టికాహారం వంటి వాటిని అందచేయాలని నిర్ణయించింది. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం అల్పాహార పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రానికి సమర్పించిన అధికారులు అందుకు అదనపు నిధలపై ఎదురు చూస్తున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలపై ఇటీవలే కేంద్రానికి ప్రతిపాదనలు అందచేశారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల 8.6 లక్షల మంది పిల్లలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం ద్వారా పూర్తి వేడి భోజనంతో పాటు గుడ్డు, స్నాక్స్ చిన్నారులకు అందజేస్తున్నారు. అయితే వివిధ కారణాల వల్ల కరోనా తర్వాత పలువురు చిన్నారులు పోషకార లోపంతో భాదపడుతున్నారని, ఆ కారణంగానే అంగన్వాడీ చిన్నారుల పోషణను మెరుగు పరిచేందుకు అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత అల్పాహార పథకం అమలు చేస్తే చిన్నారులు ప్రతిరోజూ అదనపు పోషకాహారం అందుకుంటారని, దీంతో పాటు చిన్నారులు ప్రీస్కూళ్లకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించినట్లు అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం వల్ల 8.6 లక్షల మంది అంగన్ వాడీ చిన్నారులు ప్రయోజనం పొందుతారని అంచనా.



## అశ్వారావుపేటలో రోడ్డుప్రమాదం

### ఆటో, ట్రాక్టరును ఢీ కొన్న లారీ

### ఇరువురు దుర్మరణం.. ముగ్గురి పరిస్థితి విషమం

**అశ్వారావుపేట అర్బన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మండల కేంద్రం అశ్వారావుపేటలో గురువారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ఎదు రెదురుగా వెళ్తున్న లారీ అదుపుతప్పి ఆటో, ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల ఇలా ఉన్నాయి. పట్టణంలోని కెమిలాయిడ్స్ సంస్థలో పనిచేస్తున్న చిట్లూరి కృష్ణయ్య, కొవ్వాసి నాగరాజులు మరో ముగ్గురు కలిసి ట్రాక్టర్‌పై పట్టణంలోని ఫ్యాక్టరీ వ్యర్థ పదార్థాలు పోసే చోటుకు వెళుతుండగా స్థానిక రైతువేదిక సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో సంఘటన స్థలంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. ట్రాక్టర్లో ప్రయాణం చేస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అవటంతో వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. సమాచారం అందుకున్న సిఐ నాగరాజు, ఎసఐ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# హైదరాబాద్‌లో అమెరికా సంస్థ ప్రోటోలాబ్స్ జిసిసి

### యేడాది కాలంలో 800 జిసిసి

### 300 మందికి ఉపాధి అవకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఆధునాతన ఇంజినీరింగ్, డిజిటల్ తయారీ సంస్థ ప్రోటోల్యాబ్స్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి గ్లోబల్ సామర్థ్య కేంద్రం (జిసిసి) ఏర్పాటుకు ముందుకొచ్చిందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. దీని స్థాపనతో 300 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయని ఆయన తెలిపారు. అమెరికాలోని మిన్నెసోటా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ప్రోటోల్యాబ్స్ స్థానిక ఆరోహన్ గ్లోబల్ కన్సల్టెంగ్ తో కలిసి ఈ జిసిసిని నెలకొల్పుతుంది. గురువారం ప్రోటోల్యాబ్స్ ప్రతినిధి బృందం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటి అయింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తమ విస్తరణ కార్యక్రమాలను వివరించారు. జిసిసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం పట్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేసారు. గడచిన ఏడాది కాలంలో 80 జిసిసిలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, చక్కని ఎకో సిస్టం ఉండటం వల్ల జిసిసిలను ఆకర్షించగలుగుతున్నాం. డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు కూడా తెలంగాణా ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

నైపుణ్యం ఉన్న ఇంజనీరింగ్ మానవ వనరులు, పటిష్టమైన డిజిటల్ మౌలిక వ్యవస్థ, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, వేగంగా విస్తరిస్తున్న తయారీ రంగం, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జిసిసిలకు అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. డిజైన్, ఇంజనీరింగ్, ప్రోటోటైపింగ్, తయారీ రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించిందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన ఇంజినీరింగ్, డిజిటల్ తయారీ సాంకేతికతలు, ఉత్పత్తి అభివృద్ధి రంగాల్లో విస్తృత కార్యకలాపాలు సాగనున్నాయి. దీంతో హైదరాబాద్ హై వ్యాల్యూ తయారీ రంగంలో మరింత శక్తివంతంగా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొటోల్యాబ్స్ రాకతో స్థానిక స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మద్యతరహా సంస్థలు, పెద్ద పరిశ్రమలకు ప్రొటోటైపింగ్ తయారీ సదుపాయాలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి మరింత వేగంగా తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. చైనాపై ఆధారపడే అవసరం తగ్గిపోతుందని చెప్పారు. ప్రోటోల్యాబ్స్ ప్రతినిధి బృందంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ డాన్ షూమాకర్, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ అగ్నెస్ సెమింగ్టన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ కెర్మిష్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ శర్మలు ఉన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ కూడా పాల్గొన్నారు.

# గృహా కొనుగోలుదారులకు ఊరట

### టిజి రెరాలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గృహ కొనుగోళ్లు, రియల్ రంగంలో సందేహాలు, సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ తదితర సేవల కోసం తెలంగాణ రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులెటరి అథారిటి) ప్రత్యేకంగా పబ్లిక్ గ్రివెన్స్ అండ్ గైడెన్స్ సెల్ (పిజిజిసి) విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగాన్ని రెరా కార్యాలయంలో గురువారం తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, జస్టిస్ సంతోష్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ రంగంలో గృహ కొనుగోలుదారులు, ప్రమోటర్లు, ఏజెంట్లకు సంబంధించిన సందేహాలు, సమస్యలు, ఫిర్యాదులు, అవగాహన, ప్రాజెక్టు వివరాలు తదితర అంశాలపై సమాచారం, నివృత్తి తదితర సేవలను ఈ విభాగం అందించనుందని తెలిపారు. రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ డెవలప్‌మెంట్) చట్టం, 2016 పరిధిలోకి వచ్చే వాటాదారులకు (గృహ కొనుగోలుదారులు, ప్రమోటర్లు/ బిల్డర్లు, ఏజెంట్లు) అవసరమైన మార్గదర్శకత్వం, ఖచ్చితమైన సమాచారం, ఫిర్యాదుల దాఖలులో సహాయ సహకారాలను అందించే ఏకైక, వ్యవస్థీకృత కేంద్రంగా పిజిజిసిని ఏర్పాటు చేశామన్నారు. గృహ కొనుగోలుదారుల సంక్లిష్టతలను సులభతరం చేసేలా అవగాహన కల్పించడం, ఫిర్యాదుల పరిష్కారానికి స్పష్టమైన, సహాయక మార్గాన్ని అందించడంలో ఈ సెల్ కీలక సాధనంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెరా చైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ, సభ్యులు జన్ను లక్ష్మి నారాయణ, శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) డైరెక్టర్, డా. జనార్దన్‌రెడ్డి, రెరా అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీపై మహాధర్నాకు సిపిఎం మద్దతు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సాగుతున్న అడ్డూఅదుపు లేని ఫీజు దోపిడీని నిరసిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సీపీఐ(ఎం) మద్దతును ప్రకటిస్తోందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నేతలు కలిసి, ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని మద్దతు కోరారని, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్లు, డొనేషన్లు, రీఅడ్మిషన్ల పేరుతో విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యను సామాన్యులకు అందకుండా మారుస్తున్నాయన్నారు. పాఠశాలలు కేవలం విద్యా బోధనకు పరిమితం కాకుండా వివిధ రకాల విద్యార్థులకు సంబంధించినవి తమ వద్దనే కొనాలని నిర్బంధిస్తూ 'షాపింగ్ మాల్స్'గా మారిపోయాయని, విద్యా హక్కు చట్టం అమలులో ఉన్నా, నిరుపయోగంగా మారిందన్నారు. బలమైన ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు బరితెగిస్తున్నాయని, ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని జాన్ వెస్లీ మండిపడ్డారు.

# బిజెపి ఎంపి తేజస్వి పై చర్యలు తీసుకోండి

### డిజిపి శివధర్‌రెడ్డికి మంత్రి పొన్నం లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** పార్లమెంట్ సాక్షి గా తెలంగాణ విభజనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డికి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. తెలంగాణ ఏర్పాటును భారత్, పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు తెలంగాణ ఏర్పాటు అనేది ఇక్కడి ప్రజల న్యాయమైన ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ.. ఒక ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ఫలితంగా జరిగింది.

తెలంగాణ ఏర్పాటను భారతదేశపు బాధాకరమైన, హింసాత్మక విభజనతో పోల్చడం ఆ ప్రక్రియ పవిత్రతను తగ్గించడమే కాకుండా.., తెలంగాణ ప్రజల మనోభావాలను విస్మరించినట్లు అవుతుంది.

ఇటువంటి ప్రకటనలు ప్రజా సామరస్యాన్ని దెబ్బతీయడానికి, ప్రాంతీయ కలహాలను పెంచడానికి, చారిత్రక, రాజ్యాంగ వాస్తవాలను వక్రీకరించడానికి అవకాశం ఉంది. అలానే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి, ప్రజా శాంతి, సామరస్యాలను కాపాడడానికి. ఈ విషయాన్ని పరిశీలించి, చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం బీజేపీ ఎంపీపై తగిన చర్యలు తీసుకోవాలి అని డీజీపీని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## బిజెపి ఎంపి తేజస్విసూర్య వ్యాఖ్యలు దురహంకారపూరితం

### రెండు రాష్ట్రాల ప్రజలకు బిజెపి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ(బిజెపి) ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దురహంకారపూరితంగా ఉన్నాయని, ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో రెండు రాష్ట్రాల ప్రజలకు బిజెపి బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షి గా బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, భారత దేశ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు.

బ్రిటిష్ వారు భారతదేశాన్ని, పాకిస్తాన్‌ను విడగొట్టిన పద్ధతిలోనే ఆంధ్ర, తెలంగాణ విభజన జరిగిందని తేజస్వీ సూర్య మాట్లాడటం ఆయన అజ్ఞానానికి, తెలుగు ప్రజల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనమన్నారు. దశాబ్దాల పోరాటాలు, వందలాది మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఒక దేశ విభజన నాటి రక్తపాతంతో పోల్చడం అత్యంత హేయమన్నారు. తామే తెలంగాణ ఇచ్చామని, ఇక్కడ 'విమోచన దినోత్సవాలు' జరుపుకుంటామని చెప్పుకునే బిజెపి నాయకులు, పార్లమెంటులో మాత్రం రాష్ట్ర ఏర్పాటును అవమానపరిచేలా మాట్లాడటం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనమని విమర్శించారు. నాడు బిల్లుకు మద్దతు పలికిన వెంకయ్య నాయుడు, సుష్మా స్వరాజ్ వంటి నేతల నిర్ణయాలను ఇప్పుడు తేజస్వీ సూర్య తప్పుబడుతున్నారా? మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు, దక్షి ణాది రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడకుండా.. ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం ద్వారా చర్చను పక్కదారి పట్టించాలని బిజెపి చూస్తోందని జాన్ వెస్లీ మండిపడ్డారు.

## బిఆర్ఎస్ ఎంపీలే సభలో ఉంటే తేజస్విసూర్య సంగతి తేల్చేవాళ్లు

### మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు... ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్‌పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదే బాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు.



రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ కూడా ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటుపై విషం చిమ్మారు. తేజస్వీ వ్యాఖ్యలపై బిజెపి అధిష్ఠానం వైఖరి ఏంటో చెప్పాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ఇండియా–పాక్ విభజన లాంటిదైతే బిజెపి ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు.

# అనర్హత పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయండి

### స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 16:** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలను హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, సంజయ్, తెల్లం వెంకట్రావుతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణ మే 6వ తేదీకి వాయిదా వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్, కడియం శ్రీహరి ఆ తర్వాత కాంగ్రెస్ గూటికి చేరారని బిఆర్ఎస్, బిజెపి ఆరోపిస్తూ వీరిపై వేటు వేయాలని సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను గతంలోనే ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన స్పీకర్ వీరంతా పార్టీ మారడానికి సరైన ఆధారాలు లేవంటూ ఈ పది మందికి క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బిఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇందులో గూడెం మహిపాల్‌రెడ్డి తిరిగి బిఆర్ఎస్‌తో సన్నిహితంగా ఉంటున్న నేపథ్యంలో ఆయన పేరును తమ పిటీషన్‌లో పేర్కొనలేదు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది బిఆర్ఎస్ ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది.

# అణు విద్యుత్ ప్లాంట్లలో విదేశీ ఎంట్రీ

### 49 శాతం ప్రత్యక్ష పెట్టుబడుల సిఫార్సు

### 2047 నాటికి 100 మెగావాట్ల లక్ష్యం


### అణు ఇంధన నిర్వహణకు అనుమతి

### రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్య ప్లాంట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటులో విదేశీ సంస్థలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. అణు విద్యుత్ రంగానికి సంబంధించి 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) తలుపులు బార్లా తెరవనున్నాయి. ప్రస్తుతం భారతదేశం ఈ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించడం లేదు. అయితే 2047 నాటికి 100 మెగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉండాలనే దేశ లక్ష్యాన్ని చేరుకోవడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి ఆదేశించబడిన అంతర్ మంత్రిత్వ కమిటీ చేసిన ప్రతిపాదనలలో ఇవి ఉన్నాయి. ప్రభుత్వం ఈ రంగంలో విదేశీ సంస్థలను అనుమతించేందుకు అనేక మార్పులను చేపట్టాలని కేంద్రం నియమించిన ప్రభుత్వ కమిటీ సిఫారసు చేసింది. ఈ కమిటీ తన నివేదికను కేంద్రానికి తాజాగా సమర్పించినట్లు ఇంధన మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి ఒకరు తెలిపారు. ఈ కమిటీలో అణుశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి పిఎస్ కార్తికేయన్, కేంద్ర విద్యుత్ అథారిటీ సభ్యుడు అజయ్ తలేగావ్కర్ సహ అధ్యక్షునిగా ఉన్న ఈ కమిటీలో అణుశక్తి శాఖ, భారత అణుశక్తి సంస్థ, విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఎన్టీపీసీ, భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అధికారులు ఉన్నారు. కమిటీ సిఫార్సుల ప్రకారం 100 గిగావాట్ల అణుశక్తి లక్ష్యంలో స్వదేశీ ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల నుండి 46.5 గిగావాట్లు, ప్రెజరైజ్డ్ వాటర్ రియాక్టర్ల నుండి 38.8 గిగావాట్లు, భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, భారత్ స్మాల్ రియాక్టర్లు, ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ల నుండి ఒక్కొక్కటి 5 గిగావాట్లు ఉన్నాయి. లైసెన్సింగ్ ద్వారా ప్రభుత్వం నియంత్రించే అణు ఇంధన నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాలను అనుమతించడం కూడా మరిన్ని సిఫార్సుల్లో ఉన్నాయి. ఇక అణు విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ లేదా విద్యుత్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి వివిధ దేశాలకు చెందిన సంస్థలకు అవకాశం కలుగుతుంది. ఈ పెట్టుబడి ఆటోమేటిక్ మార్గంలో 100 వరకు ఉంటుంది, దీనికి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దేశ అణు విద్యుత్ రంగంలో దీర్ఘకాలిక పెట్టుబడితో పాటు, దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలపై గణనీయమైన నియంత్రణ లేదా ప్రభావాన్ని పొందనున్నాయి. ఇందుకు గాను ప్రస్తుతం ఉన్న చట్టానికి సవరణలు చేయాలని, ప్లాంట్ ఆపరేటర్లతో వారి ఒప్పందాలలో పరికరాల సరఫరాదారుల బాధ్యత పరిమితిని సైతం చేర్చాలని కమిటీ సూచించింది. అణు నష్టానికి సంబంధించిన నిబంధనలను పునరుద్ధరించాలని ఇది స్పష్టం చేసింది. అలాగే ప్రస్తుత ఫ్లోటర్ పాలసీకి బదులుగా, ప్రతి సంఘటనకు ఆపరేటర్లు రూ.1,500 కోట్లకు బీమా పొందగలిగేలా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఇండియన్ న్యూక్లియర్ ఇన్సూరెన్స్ పూల్ (ఐఎన్ఐపి) అందించే బీమా పాలసీని తిరిగి రూపొందించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెప్పింది. ఇందుకు ఐఎన్ఐపి సామర్థ్యాన్ని పెంచడం అవసరమని పేర్కొంది. కాగా రాష్ట్రంలో అణు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై సర్కార్ దృష్టిసారించింది. రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. అందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలియవచ్చింది. తదుపరి వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా అణు ఇంధన ఉత్పత్తికి కావాల్సిన వనరులు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, అందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున 4 రూపాయలు వరకూ ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ 2.15 రూపాయలకు లభిస్తోంది. ఇక రాత్రి వేళల్లో ఎక్సేంజలో విద్యుత్ సేకరిస్తే యూనిట్‌కు 9 రూపాయల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాలపై దృష్టిసారించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## దీపం వెలిగిస్తుండగా విషాదం

### చీరెకు నిప్పంటుకుని మంటల్లో చిక్కుకున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి



విజయలక్ష్మి ్మ (ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యామలాల్ బిల్డింగ్ సమీపంలో గురువారం విషాదకర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో విజయలక్ష్మి ్మ (రిటైర్డ్ ప్రిన్సిపాల్) మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయలక్ష్మి ్మ తన నివాసంలోని పై అంతస్తులో ఒంటరిగా ఉంటూ ప్రతిరోజూ మాదిరిగానే మధ్యాహ్నం సమయంలో పూజ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దేవుడికి దీపం వెలిగిస్తుండగా అకస్మాత్తుగా ఆమె చీర కొంగుకు నిప్పంటుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురైన ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లారు. అక్కడ దుప్పటికి మంటలు అంటుకోవడంతో అగ్నిజ్వాలలు మరింతగా వ్యాపించాయి. మంటలు అదుపు తప్పడంతో విజయలక్ష్మి ్మ ఒంటంతా కాలిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇంటి నుండి పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అదే ఇంటి రెండో అంతస్తులో ఆమె కూతురు నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమయంలో తల్లి పూజలో ఉండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఆమె తెలిపింది. పాఠశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించి రిటైర్ అయిన విజయలక్ష్మి ్మ ఇంట్లోనే నివసిస్తూ సాధారణ జీవితం గడుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# 25 కోట్ల హార్ట్ బ్రేక్

*25కోట్ల ట్యాగ్- ఆటలో నో ఇంఫాక్ట్... ఐపీఎల్ వేలంలో ధర చూసి షాక్-ఇపుడు ఆటచూసి భారీ షాక్... కోట్ల కుర్రాడు-క్రీజ్‌లో మాత్రం గెస్ట్ అప్పియరెన్స్. ఇవి ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామరూన్ గ్రీన్‌పై సోషల్‌మీడియాలో వెల్లువెత్తుతున్న కామెంట్స్. గ్రీన్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ అంచనాలు పెట్టుకుంది. తమ తలరాత మారుస్తడనుకుని ఐపీఎల్ వేలంలో ఏకంగా 25 కోట్ల 20 లక్షలు వెచ్చించి దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా నిలిచాడు. ఇపుడు అతని ఆట చూసి 25 కోట్లు బూడిదలో పోసిన పన్నీరైందని కేకేఆర్ అభిమానులు భగ్గుమంటున్నారు.*

(వార్త క్రీడా విభాగం)

భారీ అంచనాలతో కేకేఆర్ జట్టులోకి వచ్చిన ఆస్ట్రేలియా మేటి ఆల్‌రౌండరైన కామరూన్ గ్రీన్.. వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్నాడు. ఇటు బ్యాట్‌తో మెరుపులు మెరిపించక, ఇటు బౌలింగ్‌లో రాణించక జట్టుకు భారంగా మారాడు. కేకేఆర్ వరుస పరాజయాలతో కారకుడవుతున్నాడు.



ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడిన 5 మ్యాచ్‌ల్లో కామరూన్ గ్రీన్ చేసిన స్కోర్లు 18, 2, 4, 32, డకౌట్. మొత్తం పరుగులు 56 మాత్రమే. తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 18 పరుగులతో కామరూన్ ఫెయిల్యూర్ స్టోరీ ప్రారంభమైంది. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్‌పై అయితే సింగిల్ డిజిట్‌కే అవుటయ్యాడు. అయినా కామరూన్ ఏదో సాధిస్తాడని కేకేఆర్ మేనేజ్‌మెంట్... అతన్ని తుది జట్టులో కొనసాగిస్తోంది. లక్నోపై 32 పరుగులతో అజేయంగా నిలిచి ఆశలు రేపినా... కీలకమైన చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు. పోనీ బౌలింగ్‌లోనైనా జట్టుకు ఉపయోగపడ్డాడా అంటే అదీ లేదు. మొదటి మూడు మ్యాచ్‌ల్లో బౌలింగే చేయలేదు. లక్నో, సీఎస్కే మ్యాచ్‌ల్లోనూ కాస్టీలీగా తేలాడు. ఒకే ఒక వికెట్ పడగొట్టాడు.

కామరూన్ వైఫల్యం కేకేఆర్ జట్టుపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. ఈ జట్టు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే. అయిదు మ్యాచ్‌లాడినా గెలుపు బోణీ కొట్టలేకపోయింది. దీంతో కామరూన్ గ్రీన్ ఆటతీరుపై సోషల్ మీడియాలో ట్రోల్స్ వర్షం కురుస్తోంది. గ్రీన్ పేలవ ప్రదర్శనపై కేకేఆర్ అభిమానులు నిప్పులు చెరుగుతున్నారు. 25 కోట్ల రూపాయలు దండగ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అసలు ఇంత భారీ ధర పెట్టి కామరూన్ గ్రీన్‌ను ఎందుకు తీసుకున్నారంటూ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నిస్తున్నారు.

మరికొందరైతే ఏకంగా ఇతడొక ఫ్రాడ్‌అంటూ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. జట్టులో కీలక ఆటగాడిగా మారతారనుకున్న కామరూన్ గ్రీన్, వరుసగా విఫలమవుతుండటంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలపై భారీ ప్రభావం చూపుతుందోనని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# కోల్..కథ మారేనా?

**ఆహ్మదాబాద్:** వరుసగా రెండు విజయాలతో జోరు మీదికొచ్చిన గుజరాత్ టైటాన్స్... సొంత గడ్డపై ఫామ్‌లో లేని కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో గెలుపుతో హ్యాట్రిక్ విన్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్... ఐపీఎల్‌లో రెండు ఓటములు, రెండు విజయాలతో ఉంది. మరోవైపు అజింక్యా రహానే నేతృత్వంలోని కేకేఆర్... ఈ మ్యాచ్‌లోనైనా గెలుపు బోణీ చేయడంపై ఫోకస్ పెట్టింది. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింట ఓటమి ఎదురవగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది.

వరుస విజయాలతో గుజరాత్ గెలుపు ట్రాక్‌లో ఉంది. టాప్ ఆర్డర్ మొత్తం పరుగుల వేటలో ఉన్నారు. సాయి సుదర్శన్, గిల్‌తో పాటు జాస్ బట్లర్, వాషింగ్టన్, రాహుల్ తెవాటియా చక్కగా రాణిస్తున్నారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వరుస అర్ధసెంచరీలతో టాప్ లేపుతున్నాడు. ఇక రబడా, అశోక్ శర్మ, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో పేస్ అటాక్, రషీద్ ఖాన్ రూపంలో మేటి స్పిన్నర్ కలిసి ఉంది. కోల్‌కతాకు బ్యాటింగ్ ఆందోళన పరుస్తోంది. కెప్టెన్ అజింక్యా రహానే

| ఐపీఎల్‌లో నేటి మ్యాచ్ | |
|---|---|
| కోల్‌కతా నైట్ రైడర్స్ V/S గుజరాత్ టైటాన్స్ | రాత్రి 7.30 గం.లకు |

మినహాయిస్తే ఎవరూ పెద్దగా స్కోర్లు సాధించలేకపోతున్నారు. ఫిన్ అలెన్, నరైన్, రింకూ సింగ్, కామరూన్ గ్రీన్ వైఫల్యం కేకేఆర్‌ను వెంటాడుతోంది. రఘువంశీ కొన్ని పరుగులు సాధిస్తున్నా పెద్ద స్కోర్లుగా మలచలేకపోతున్నాడు. కేకేఆర్ బ్యాటింగ్ కుదురుకుంటే ఇక తిరుగుండదు. బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా పెద్దగా రాణించలేకపోతోంది.

ఇరు జట్లు ఇప్పటివరకు 5 సార్లు తలపడగా గుజరాత్ టైటాన్స్ పైచేయిగా ఉంది. మూడు మ్యాచ్‌ల్లో గుజరాత్, ఒక మ్యాచ్‌లో కేకేఆర్ గెలుపొందాయి. ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. ఆహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో 414 పరుగులు పారిన మ్యాచ్‌లో రాజస్థాన్ చేతిలో గుజరాత్ పరాజయం పొందింది.

# క్యాండిడేట్స్ చెస్ విమెన్ ఛాంప్ వైశాలి

## ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం జూ వెన్‌జున్‌తో పోరు

**పాఫోస్(సైప్రస్):** భారత విమెన్ గ్రాండ్ మాస్టర్, తమిళనాడుకు చెందిన ఆర్.వైశాలి.. సైప్రస్‌లోని పాఫోస్‌లో జరిగిన ఫిడే క్యాండిడేట్స్ మహిళల విభాగంలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా ఈ ఏడాది చివర్లో జూ వెన్‌జున్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది.

టోర్నీ ఆరంభానికి ముందే కోనేరు హంపి వైదొలడంతో దివ్య దేశ్‌ముఖ్‌పైనే అందరి దృష్టి నిలిచింది. ప్రజ్ఞానంద సోదరి వైశాలి ఈ టోర్నీలో అండర్ డాగ్‌గా బరిలోకి దిగింది. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ విజేతగా ఆవిర్భవించింది. చివరిదైన 14వ రౌండ్లో 24 ఏళ్ల వైశాలి తెల్ల పావులతో ఆట మొదలు పెట్టింది. రష్యా క్రీడాకారిణి కేథరినా లాగ్నోను అటాకింగ్ గేమ్‌తో బోల్తా కొట్టించింది. విజేతగా నిలవాలంటే తప్పక గెలవాల్సిన ఆఖరి రౌండ్‌లో వైశాలి ఒత్తిడికి లోనేకాకుండా కీలకదశలో తెలివైన ఎత్తులతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. పూర్తి ఆధిక్యత కనబర్చింది. 14వ రౌండ్‌కుముందు వైశాలి, బిబిసారా(కజకిస్థాన్) చెరో 7.5 పాయింట్లతో సమవుజ్జీగా ఉన్నారు. అయితే భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్.. బిబిసారాతో గేమ్‌ను డ్రా చేయడంతో వైశాలికి మార్గం సుగమమైంది. 8.5పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బిబిసారా 8పాయింట్లతో రెండో స్థానం పొందింది. ఈ టోర్నీలో వైశాలి కేవలం రెండు గేమ్‌ల్లోనే ఓడింది. భారత్ నుంచి క్యాండిడేట్స్ టోర్నీ నెగ్గిన మూడో ప్లేయర్‌గా వైశాలి నిలిచింది. ఓపెన్ విభాగంలో ఇంతకుముందు 2014లోవిశ్వనాథన్ ఆనంద్, 2024లో గుకేష్ టైటిల్ గెలుపొందారు.



# వస్తూనే సెంచరీ మోత

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లోకి వస్తూనే క్వింటాన్ డికాక్(60 బంతుల్లో 112 నాటౌట్) సెంచరీ మోత మోగించాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతక్కొట్టాడు. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడుతూ 53 బంతుల్లోనే 7 ఫోర్లు, మరో ఏడు సిక్స్ లతో సెంచరీ నమోదుచేశాడు. ఇది ఐపీఎల్‌లో రెండో సెంచరీ కాగా, క్విటాన్ డికాక్‌కు ఐపీఎల్‌లో మూడో సెంచరీ. గతంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతూ ఓ సెంచరీ, డిల్లీ క్యాపిటల్స్ తరపున మరో సెంచరీ చేశాడు.

రోహిత్ శర్మ స్థానంలో ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన డీకాక్... తానెదుర్కొన్న తొలి బంతికే జెన్సన్ బౌలింగ్‌లో ఓవర్ కవర్ మీదుగా సిక్స్ బాది పరుగుల ఖాతా తెరిచాడు. ఒకవైపు వెంటవెంటనే రెండు వికెట్లు రికల్టన్(2), సూర్యకుమార్(0) కోల్పోయినా నమన్ ధీర్(50)తో కలిసి పంజాబ్ బౌలర్లను చితకొట్టాడు. మూడో వికెట్‌కు 120 రన్స్ జోడించాడు. ఈ క్రమంలో చాహల్ బంతులపై సిక్స్, ఫోర్ సాధించిన డికాక్.. చాహల్ మరో ఓవర్‌లో సిక్స్, సింగిల్‌తో 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత బార్ట్‌లెట్ ఓవర్లో ఫోర్, సిక్స్.. చాహల్ ఓవర్‌లో సిక్స్‌తో 15 రన్స్, శశాంక్ బంతులపై డబుల్ సిక్స్‌లతో 15 రన్స్, బార్ట్‌లీ బంతికి బౌండరీతో సెంచరీ పూర్తి చేశాడు. అదే జోరు కొనసాగిస్తూ 112 పరుగులతో అజేయంగా నిలిచాడు. డికాక్ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యాతో కలిసి నాలుగో వికెట్‌కు 41రన్స్ జోడించాడు. ఐపీఎల్‌లో మూడు వేర్వేరు జట్ల తరఫున సెంచరీలు బాదిన మూడో బ్యాటర్‌గా డికాక్ నిలిచాడు. డికాక్ శతక ఇన్నింగ్స్‌తో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 195 రన్స్ చేసింది. ప్రభ్‌సిమ్రాన్(80), శ్రేయాస్(66) అర్ధసెంచరీలతో పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది.



## హెల్త్‌కేర్ కంపెనీలకు క్యూ4లో మిశ్రమ ఫలితాలు

# సింగిల్ డిజిట్ వృద్ధి నమోదు



**ముంబై, ఏప్రిల్ 15:** దేశంలో హెల్త్‌కేర్ రంగంలోని కంపెనీలకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4) మిశ్రమ ఫలితాలను అందించనుంది. ఈ త్రైమాసికంలో కంపెనీల ఆదాయంలో అధిక సింగిల్‌డిజిట్ వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటి లాభదాయకత, నికర ఆదాయం గణనీయంగా క్షీణించవచ్చని ప్రముఖ అనలిటిక్స్ సంస్థ 'సిస్టమాటిక్స్' తన నివేదికలో వెల్లడించింది.

నివేదిక అంచనాల ప్రకారం, ఫార్మా కంపెనీల ఆదాయంలో సగటున 12శాతం వృద్ధి కనిపించినా, ఎబిటా (ఇబిఐటిడిఎ)లో కేవలం3.6 శాతం పెరుగుదల మాత్రమే ఉంటుంది. ఇక నికర లాభాల్లో ఏకంగా 14 శాతం క్షీణత నమోదయ్యే అవకాశం ఉంది. ఇందుకు ప్రధాన కారణం క్యాన్సర్ చికిత్సలో వాడే 'జెనరిక్ రెవ్లిమిడ్' అనే ఔషధంపై పలు భారతీయ కంపెనీలు ప్రత్యేక హక్కులను కోల్పోవడమే. దీని ప్రభావం ముఖ్యంగా డాక్టర్ రెడ్డీస్, జైడస్, సిప్లా, సన్ ఫార్మా వంటి దిగ్గజ సంస్థలపై స్పష్టంగా కనిపించనుంది.

ఇదే సమయంలో, లాన్రియోటైడ్ అనే మరో ఔషధం సరఫరాలో అంతరాయాల కారణంగా సిప్లా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవచ్చని నివేదిక పేర్కొంది. అలాగే, మిరాబెగ్రాన్ సంబంధిత రాయల్టీ చెల్లింపుల వల్ల లూపిన్, జైడస్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెరగవచ్చని అంచనా వేసింది. అన్నింటికంటే ముఖ్యంగా, డాక్టర్ రెడ్డీస్ ఆదాయంలో జెనరిక్ రెవ్లిమిడ్ వాటా అధికంగా ఉన్నందున, ఆ సంస్థ లాభాల్లో అత్యంత భారీ క్షీణత నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కూడా ఈ రంగంపై పడనుంది. రవాణా ఛార్జీలు, ముడిసరుకుల ధరలు పెరగడం ప్రతికూలంగా మారితే, డాలర్‌తో రూపాయి మారకం విలువ అనుకూలంగా ఉండటం కొంత ఉపశమనం కలిగించవచ్చు. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే, ముడిసరుకుల ధరల భారాన్ని ఎపిఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్) తయారీదారులు ఫార్ములేషన్




# జిడిపి 7.1 శాతంగా అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఐఏఎన్ఎస్):** ప్రపంచ, దేశీయ కారకాల వల్ల స్వల్పకాలిక అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, భారతదేశపు ప్రామాణిక 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడి జూన్ నాటికి 7శాతం మార్కు కంటే దిగువకు తగ్గవచ్చని గురువారం ఒక నివేదిక తెలిపింది. క్రిసిల్ ఇంటెలిజెన్స్ విశ్లేషణ ప్రకారం, ముడి చమురు ధరలలో భారీ పెరుగుదల, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్చి నెలలో బాండ్ల రాబడులు గణనీయమైన అస్థిరతను చవిచూశాయి. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రామాణిక రాబడిని గరిష్ట స్థాయికి చేర్చింది. అయితే, తగ్గుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అనుకూలమైన ద్రవ్య లభ్యత పరిస్థితులు, విధానపరమైన అంచనాలు రాబోయే నెలల్లో రాబడులను స్థిరీకరించడానికి సహాయపడతాయని ఆ నివేదిక పేర్కొంది. ఆరోగ్యకరమైన ప్రైవేట్ వినియోగం, స్థిరమైన పెట్టుబడి వృద్ధి మద్దతుతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి 7.1 శాతంగా ఉంటుందని తమ ప్రాథమిక అంచనా అని ఆ నివేదిక జోడించింది.

అమెరికా సుంకాలు తగ్గడం వల్ల ఎగుమతుల వృద్ధికి కూడా ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నప్పటికీ, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ప్రపంచ వాణిజ్యానికి కలిగే అంతరాయాలు, ప్రపంచ వృద్ధి మందగించడం వంటివి కొంత ప్రతికూలతగా మారవచ్చు. రిటైల్ ఇంధన ధరలపై నియంత్రణ విధించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వినియోగానికి మద్దతు ఇవ్వగలవని కూడా ఇది పేర్కొంది.

ద్రవ్యోల్బణం విషయానికొస్తే, 2027 ఆర్థిక సంవత్సరంలో సిపిఐ ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని క్రిసిల్ అంచనా వేసింది. ప్రపంచ అనిశ్చితులు సెంటిమెంట్‌పై ఒత్తిడిని కొనసాగిస్తున్నప్పటికీ, దేశీయ ద్రవ్య లభ్యత సౌకర్యవంతంగా ఉందని, ఇది బాహ్య ఒడిదుడుకుల నుండి రక్షణ కవచంగా పనిచేస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ముడి చమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో, బాండ్ మార్కెట్‌కు కీలకమైన ప్రమాద కారకాలుగా మిగిలి ఉన్నాయని కూడా ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. పెరిగిన చమురు ధరలు ద్రవ్యోల్బణ ఆందోళనలను పెంచి, రాబడులలో ఏదైనా తగ్గుదల వేగాన్ని పరిమితం చేయగలవని ఇది పేర్కొంది. అదే సమయంలో, యూఎస్ ట్రెజరీ రాబడులలో కదలికలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ విధాన గమనంతో సహా ప్రపంచ సంకేతాలు, భారత బాండ్ రాబడుల దిశను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అంచనా. దేశీయంగా, అస్థిర పరిస్థితుల నడుమ కేంద్ర బ్యాంకు స్థిరీకరణ పాత్ర పోషిస్తుందని భావిస్తున్నందున, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్య నిర్వహణ చర్యలు, విధాన వైఖరి కూడా ప్రభావం చూపనుందని పేర్కొంది.


ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) పాలసీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తుందని తమ ప్రాథమిక అంచనా భావిస్తున్నట్లు క్రిసిల్ జోడించింది. ఈ ప్రతికూలతలు ఉన్నప్పటికీ, స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, అస్థిరత తగ్గుముఖం పట్టడంతో రాబడులు క్రమంగా తగ్గుతాయని అంచనా వేస్తూ, భవిష్యత్ అంచనాలు మధ్యస్తంగా సానుకూలంగానే ఉన్నాయని క్రిసిల్ పేర్కొంది.

# బ్యాంక్, ఆటో స్టాక్స్ పతనం


## సెన్సెక్స్122.56, నిఫ్టీ 34.55 పాయింట్లు నష్టం

**ముంబై, ఏప్రిల్ 16:** బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేయడంతో, బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్ గురువారం తమ ఇంట్రాడే గరిష్టాల నుంచి పడిపోయి ముగిశాయి. అయితే, అమెరికా- ఇరాన్ మధ్య జరగబోయే చర్చలపై మరింత స్పష్టత వచ్చే వరకు పెట్టుబడిదారులు అప్రమత్తంగానే ఉన్నారు. రోజులో అధిక భాగం లాభాల్లో కొనసాగినప్పటికీ, చివరి గంటల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో గరిష్ఠ స్థాయిల నుంచి కిందకు జారాయి. బ్యాంకింగ్, ఆటో రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ముగింపు గంట మోగే సమయానికి, సెన్సెక్స్ 122.56 పాయింట్లు లేదా 0.16శాతం తగ్గి 77,988.68వద్ద ముగిసింది.

నిఫ్టీ కూడా అదే బాటలో పయనించి, 34.55 పాయింట్లు లేదా 0.14శాతం తగ్గి 24,196.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్లు ఉన్నాయి. ప్రధాన సూచీలలో బలహీనత ఉన్నప్పటికీ, విస్తృత మార్కెట్లు నిలకడను ప్రదర్శించి, బెంచ్‌మార్క్‌లను అధిగమించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.63 శాతం లాభంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.83 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే, మెటల్, ఐటీ స్టాక్స్ లాభాలకు నాయకత్వం వహించాయి. వీటిలో నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఐటీ సూచీలు అగ్రగామిగా నిలిచాయి. దీనికి విరుద్ధంగా, ప్రైవేట్ బ్యాంకులు, ఆర్థిక సేవల వంటి వడ్డీ రేటుకు సున్నితమైన రంగాలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అగ్ర నష్టాలతో ముగిశాయి. ప్రపంచ సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల చుట్టూ నెలకొన్న పరిణామాలను, ముఖ్యంగా అమెరికా- ఇరాన్ చర్చలను గమనిస్తూ, సమీప భవిష్యత్తులో మార్కెట్ భాగస్వాములు అప్రమత్తంగా ఉంటారని అంచనా. ఇవి పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, మార్కెట్ దిశను ప్రభావితం చేయగలవని నిపుణులు అభిప్రాయపడ్డారు.



మరోవైపు, నాలుగు రోజుల బలహీనత తర్వాత భారత రూపాయి పుంజుకుంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడంతో రూపాయి బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.80 నుంచి 93.50 శ్రేణిలో కదలాడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



ట్రేడ్ డీల్‌కు ముందు.. యుఎస్ వాణిజ్య ప్రతినిధితో భారత రాయబారి వినయ్ క్వాత్రా భేటీ

# 20 నుంచి మరోమారు వాణిజ్య చర్చలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** భారత్-అమెరికా మధ్య మరోసారి వాణిజ్య చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసనన గ్రీర్‌తో.. అగ్రరాజ్యానికి భారత రాయబారి అయిన వినయ్ మోహన్ క్వాత్రా తాజాగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై వీరివురూ చర్చలు జరిపారు. ఈ విషయాన్ని క్వాత్రా ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ద్వైపాక్షిక సహకారంపై ఇరు దేశాలకు ఉన్న అవకాశాలపై మేం చర్చించాం. దీంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కీలక పరిణామాలపైనా మాట్లాడుకున్నాం' అని భారత రాయబారి వెల్లడించారు. ఈ భేటీలో అమెరికా మాజీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ రాబర్ట్ ఓబ్రెయిన్ కూడా పాల్గొన్నారు ట్రేడ్ డీల్ కోసం భారత బృందం వచ్చేవారం వాషింగ్టన్‌కు వెళ్లనున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక గత నెలలో భారత్‌పై సెక్షన్ 301 కింద అమెరికా ప్రారంభించిన దర్యాప్తును విరమించుకునే అంశంపైనా వీరు చర్చించినట్లు సమాచారం. భారత్-అమెరికా ఫిబ్రవరిలో విడుదల చేసిన సంయుక్త ప్రకటన ప్రకారం.. భారత్‌పై టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడానికి అంగీకారం కుదిరింది. అయితే ట్రప్ విధించిన ఈ ప్రతీకార టారిఫ్‌లు చెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో టారిఫ్ పరంగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పు లపై చర్చలు జరిపి, తదుపరి కార్యాచరణను చేపట్టేందుకు భారత్, అమెరికా ముఖ్య సంధానకర్తలు ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో చర్చలు జరపనున్నారు.

ఇదిలా ఉండగా.. భారత్‌పై ప్రకటించిన సెక్షన్ 301 దర్యాప్తును విరమించుకోవాలని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు కేంద్రం ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. అమెరికా తయారీ రంగంలోపై తీవ్ర ప్రభావం చూపే 'సహేతుకం కాని విదేశీ ధోరణుల'ను అవలంబిస్తున్నాయా? అనే కోణంలో భారత్ సహా 15 దేశాలపై అగ్రరాజ్యం ఈ దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. అసమంజస వాణిజ్య విధానాలను అనుసరిస్తున్నాయని తేలితే వాటిపై టారిఫ్‌లు, జరిమానాలు విధించనున్నట్లు అమెరికా గతంలో వెల్లడించింది.



# కనీస వేతనం భారీగా పెంపు!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు లాంటి వార్త. ఉద్యోగుల కనీస వేతనాన్ని భారీగా పెంచాలనే కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు 8వ వేతన సంఘం ముందు పలు ప్రతిపాదనలు చేస్తూ ఉద్యోగ సంఘాల తరఫున ప్రభుత్వంతో చర్చలు జరిపే అత్యున్నత సంస్థ అయిన నేషనల్ కౌన్సిల్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (ఎన్‌సి-జెసిఎం)ఓ మెమోరాండం అందజేసింది. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉన్న రూ.18,000 కనీస వేతనాన్ని ఏకంగా రూ.69,000కు పెంచాలని ఎన్‌సి-జెసిఎం డిమాండ్ చేసింది. ఇందుకోసం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 3.833గా నిర్ణయించాలని సూచించింది. 7వ వేతన సంఘంలో ఈఫ్యాక్టర్ 2.57గా ఉండగా, అప్పటి కనీస వేతనం రూ.7,000 నుంచి రూ.18,000కు పెరిగింది. ఇప్పుడు ఉద్యోగ సంఘాలు అంతకంటే చాలా ఎక్కువ ఫిట్‌మెంట్‌ను ప్రతిపాదిస్తున్నాయి. కనీస వేతనంతో పాటు వార్షిక ఇంక్రిమెంట్ 6 శాతంగా ఉండాలని, ప్రమోషన్‌పై రెండు ఇంక్రిమెంట్లు(కనీసం రూ.10,000 లబ్ధి) ఇవ్వాలని, ఒక నెల వేతనాన్ని గ్రాట్యుటీగా అందించాలని కూడా ఎన్‌సి-జెసిఎం కోరింది. ఈ మార్పులు అమలైతే, దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుంది. ఇదిలా ఉండగా, 58 శాతం కరువు భత్యాన్ని (డిఎ) బేసిక్ పేలో కలపాలని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ప్రభుత్వాన్ని కోరుతోంది. 8వ పే కమిషన్ 2025 నవంబర్ నుంచి 18 నెలల్లోగా తన సిఫార్సులను ప్రభుత్వానికి అందిస్తుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి గతంలో తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.